
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 14 మే 2025





వీర జవాన్‌కు జగన్ నివాళి

(వివరాలు మెయిన్‌లో..)

రెవెన్యూ సమస్య..!

పెరిగిపోతున్న భూవివాదాలు

అయోమయంలో యజమానులు

రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం

బలవన్మరణం చెందుతున్న రైతులు

సమస్యలు పరిష్కరించాల్సిన వారే వాటిని సృష్టిస్తున్నారు. భూ వివాదాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల ఊరూరా 'రెవెన్యూ సదస్సు'ల పేరుతో అర్జీలు స్వీకరించింది. అసలు సమస్యే రెవెన్యూ అధికారులు, సిబ్బంది అయినప్పుడు ఎన్ని అర్జీలు ఇస్తే మాత్రం ప్రయోజనమేమిటి..? రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ఇటీవల తనకల్లు మండలంలో ఒక రైతు ఆత్మహత్య చేసుకోగా.. మరోరైతు తన పొలంలో సర్వే చేస్తుండగానే గుండెపోటుతో మృతి చెందారు. ఈ చావులకు రెవెన్యూ అధికారులే కారణమని వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆత్మహత్య చేసుకున్న శంకర్ నాయక్ (ఫైల్)



గుండెపోటుతో మృతిచెందిన శ్రీనివాసుల నాయక్ (ఫైల్)

తనకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): భూముల ధరలు పెరుగుతున్న కొద్దీ.. సమస్యలు కూడా పెరిగిపోతున్నాయి. పదేళ్లుగా భూముల ధరలు విపరీతంగా పెరగడంతో వివాదాలు ఎక్కువయ్యాయి. మండల కేంద్రాలు, జాతీయ రహదారిలోని గ్రామాల్లో రోజురోజుకు అభివృద్ధి చెందుతుండంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎప్పుడో తాతలకాలంలో అమ్మిన భూములకు కూడా తామే వారసులమంటూ వివాదాలు లేవనెత్తుతున్నారు. ఈ కారణంగా రెవెన్యూ యంత్రాగానికి అడిగినంత సొమ్ము ముడుతోంది. కొంత మంది రెవెన్యూ అధికారులు రికార్డులను తారుమారు చేసి తమకు సొమ్ము చెల్లించిన వారికి అనుకూలంగా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం చేసిన పొరపాట్ల వల్ల ఎంతో మంది రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. రెవెన్యూ అధికారులు లేని భూములను సృష్టించడంతో కొనుగోలు చేసి, రిజిష్టర్లు చేసుకున్నవారు భూమిపైకి వెళ్లినప్పుడు కోకోల్లలుగా సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించుకోలేక ఇటీవల తనకల్లు మండలంలోని పోమేనాయక్ తండాకు చెందిన శ్రీనివాసుల నాయక్ వివాదాస్పద స్థలంలోనే గుండెపోటుతో మృతిచెందారు. మూడురోజుల క్రితం రామ్లానాయక్ తండాకు చెందిన శంకర్‌నాయక్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఇన్ని జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొంతమంది గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారికి ఈప్రాంతంలో భూములను అప్పగించి ఆన్‌లైన్ చేసిన వ్యవహారాలు అనేకం ఉన్నాయి. రెవెన్యూ అధికారులు చేసిన లిటిగేషన్ల వల్ల గ్రామాల్లో వర్గాలుగా విడిపోయి కొట్టుకుని, క్రిమినల్ కేసులు పెట్టుకుని, పోలీస్ స్టేషన్ల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన భూ పట్టాలను ఆ యజమానులకు తెలియకుండా రద్దు చేసి.. మరికొంతమందికి అప్పగించిన దాఖలాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వం భూ, ఇంటి పట్టాలు మంజూరు చేసినప్పుడు అందుకు సంబంధించిన ఫైళ్లను కార్యాలయంలో ఉంచడం ఆనవాయితీ. మండలంలో వివాదాలకు సంబంధించిన ఏ ఫైల్ అడిగినా తమ కార్యాలయంలో లేదని చెబుతూ కాలం వెళ్లదీస్తున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.



అధికారుల నిర్లక్ష్యంతోనే నా తండ్రి ఆత్మహత్య



స్థానిక రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నా తండ్రి శంకర్‌నాయక్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మా తాతల కాలం నుంచి ఉన్న సర్వేనెంబర్ 20, 25- 1లో ఐదు ఎకరాల వ్యవసాయ పొలాన్ని మా కుటుంబసభ్యులకు తెలియకుండా మా అత్త, మామలకు పట్టాలిచ్చారు. ఈ విషయంలో గత మూడేళ్లుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోలేదు. అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే నా తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మా కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నా.

- భూక్యె రమేష్‌నాయక్, రామ్లానాయక్‌తండా

ఉన్నతాధికారులకు పంపుతాం

మండలంలోని తనకల్లు, గేమేనాయక్‌తండా గ్రామాలకు సంబంధించిన భూములు ఎస్టీ కమిషన్, కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. రామ్లానాయక్‌తండా, మల్లిరెడ్డిపల్లి, తదితర గ్రామాలకు చెందిన భూముల విషయంలో విచారణ నిర్వహించి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం.

-శోభాసువర్ణ, తహసీల్దార్

కొనుగోలు చేసిన భూమిలోకి రానివ్వలేదు

నా తండ్రి శ్రీనివాసులనాయక్ తనకల్లులోని సర్వేనెంబర్ 837-ఎలో 15 సెంట్లు భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమిలోకి మమ్మల్ని రానివ్వడంలేదు. ఎన్నోయేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. ఈ కారణంగా ఆ భూమిలో రాళ్లు నాటుతుండగా.. అదే భూమిని తాము కొనుగోలు చేశామంటూ వేరేవారు అడ్డుపడడంతో గుండెపోటుతో ఆ భూమిలోని నా తండ్రి మృతి చెందారు. ఇన్ని వివాదాలు కొనసాగుతున్నా, అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప స్పందించడంలేదు. ఇప్పటికైనా మాకు న్యాయం చేయండి.

-శ్రీకాంత్‌నాయక్, పోమేనాయక్‌తండా



హెల్త్ సిబ్బంది పేరుతో
మోసగించే యత్నం

ఇంటి యజమాని అప్రమత్తతతో పరారైన దుండగులు



తనకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): సర్వే పేరుతో ఓ వ్యక్తిని బురిడీ కొట్టించడానికి ప్రయత్నించిన ఉదంతం తనకల్లులో రెండు రోజుల కిందట జరిగింది. స్థానిక స్టేట్ బ్యాంక్ వీధిలో నివాసం ఉండే వెంకటరమణ ఇంటి వద్దకు ఇద్దరు యువకులు వెళ్లారు. తాము బెంగళూరు నుంచి వచ్చామని, హెల్త్ సూపర్‌వైజర్లమని చెప్పారు. ఆరోగ్య విషయంగా ఓ సర్వే చేస్తున్నామని చెప్పారు. మీ ఇంటి యజమాని ఆధార్ కార్డు, బియ్యంకార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ ఖాతా నంబరు ఇవ్వాలని అడిగారు. అనుమానంతో అప్రమత్తమైన ఇంటి యజమాని ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఈఓ ఓబులేసుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన ఈ విషయాన్ని డాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి సర్వే జరగడం లేదని, వెంటనే సర్వేకు వచ్చిన వారిని ఫొటో తీయమని సూచించారు. దీంతో ఇంటి యజమానికి ఫొటో తీసే ప్రయత్నం చేస్తుండగా, ఆ యువకులు ద్విచక్రవాహనంలో పరారయ్యారు. ఎంపీహెచ్‌ఈఓ ఈవిషయాన్ని తనకల్లు పోలీసులకు సమాచారం అందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: గోపి, ఎస్‌ఐ

మండల ప్రజలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ గోపి తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనకల్లులో రెండురోజుల కిందట కొత్త వ్యక్తులు హెల్త్ సిబ్బంది పేరుతో మోసగించేందుకు యత్నించారన్నారు. ఇంటి యజమాని అప్రమత్తంగా ఉండటంతో వారు పరారైనట్లు చెప్పారు. అపరిచితులు ఎవరైనా మీ సమాచారాన్ని అడిగితే సంబంధిత అధికారులతోకానీ, పోలీసులతోకానీ, సమీపంలోని గ్రామ సచివాలయ సిబ్బందితోకానీ ధ్రువీకరించుకోవాలన్నారు. కొత్తవారు ఎవరైనా ఏ సమాచారం కోసం ప్రయత్నించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సత్యసాయి ప్రేమతత్వం..
అనన్యం..

● మలేసియా ప్రతినిధి పువనేశ్వరి నారాయణస్వామి ● ప్రశాంతి నిలయంలో ఘనంగా బుద్ధపూర్ణిమ



మాట్లాడుతున్న పువనేశ్వరినారాయణస్వామి

పుట్టపర్తి, మే 13(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా పంచిన ప్రేమతత్వం అనన్యమని మలేసియా ప్రతినిధి పువనేశ్వరినారాయణస్వామి కొనియాడారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో బుద్ధపూర్ణిమ వేడుకలు రెండోరోజు మంగళవారం కొనసాగాయి. విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి ప్రేమతత్వంపై బౌద్ధులు.. భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం మలేసియా ప్రతినిధి పువనేశ్వరినారాయణస్వామి మాట్లాడుతూ... సత్యసాయి బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస.. భక్తులకు పరమావధిగా మారాయన్నారు. సత్యసాయి చూపిన మార్గంలో పయనిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. సాయంత్రం నేపాల్, శ్రీలంక భక్తులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో శ్రీలంక, జపాన్, సింగపూర్, నేపాల్, ఇండోనేసియా, మయన్మార్, తైవాన్ దేశాల భక్తులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న భక్తులు

కదిరిలో ఎన్నికల
హీట్..!

నియోజకవర్గంలో ఒకేసారి రెండు ఎన్నికలు



కదిరి మున్సిపల్ కార్యాలయం

19న కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక

కైవసం చేసుకునేందుకు టీడీపీ పావులు

వైసీపీలో నైరాశ్యం

కదిరి, మే 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రస్తుతం ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఒకేసారి రెండు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో నియోజకవర్గమంతా టెన్షన్ నెలకొంది. ఈనెల 19వ తేదీన కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్‌తోపాటు గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నారు. ఎలాగైనా రెండు ఎన్నికల్లో విజయం సాధించాలని టీడీపీ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. వైసీపీ మాత్రం తమ సభ్యులు.. టీడీపీకి మద్దతు పలుకుతుండడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు సమాచారం. టీడీపీలో పదవులు ఆశిస్తున్న సభ్యుల్లో టెన్షన్ మొదలైంది. సోమవారం సాయంత్రం ఎన్నికల తేదీ ప్రకటించినప్పట్నుంచి పలువురు కౌన్సిలర్లు సమావేశాలు, సమాలోచనలు చేస్తున్నారు. గాండ్లపెంట ఎంపీపీ పీఠాన్ని కూడా దక్కించుకోవాలన్న పట్టుదలతో టీడీపీ ఉన్నట్లు కనిపిస్తోంది. నియోజకవర్గంలో ఒకేసారి రెండు పదవులకు ఎన్నికలు జరుగుతుండడంతో మిగతా మండలాల్లో కూడా ఇదే విషయంపై తీవ్ర చర్చలు సాగుతున్నాయి.

ఒకేరోజు రెండు ఎన్నికలు..

ఈనెల 19 తేదీన కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక కూడా అదేరోజు జరగనుంది. గతనెల 23న కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీషా, వైస్‌చైర్మెన్ రాజశేఖర్‌రెడ్డి, కొమ్ము గంగాదేవిపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. అవిశ్వాసం నెగ్గడంతో ముగ్గురూ పదవులు కోల్పోయారు. దీంతో వారిని తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 19న చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్ ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో కదిరి మున్సిపాలిటీలో ఎన్నికల సందడి మొదలైంది. 15వ తేదీలోపు కౌన్సిల్ సభ్యులందరికీ నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కదిరి మున్సిపాలిటీలో మొత్తం 36 కౌన్సిలర్లు ఉన్నారు. వారిలో వైసీపీ తరఫున 24 మంది, టీడీపీ సభ్యులు ఐదుగురు గెలిచారు. ఒకరు స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు, ఇండిపెండెంట్.. టీడీపీలోకి చేరారు. ఇటీవల నిర్వహించిన అవిశ్వాసం తీర్మానం సందర్భంగా 13 మంది వైసీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటేశారు. వీరంతా టీడీపీకే మద్దతివ్వనున్నారు. మరికొంత మంది కూడా అధికార పార్టీకి ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మెన్ పీఠాలు టీడీపీ వశమైనట్లేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఆశావహుల్లో టెన్షన్

కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న వారిలో టెన్షన్ మొదలైనట్లు సమాచారం. ఇప్పటివరకు ఇద్దరు మాత్రమే పోటీలో ఉన్నట్లు తెలిసింది. చైర్‌పర్సన్ పదవి ఓసీ జనరల్ మహిళకు రిజర్వు చేయడంతో కౌన్సిల్‌లో ఉన్న అందరు మహిళలు పోటీ పడవచ్చు. మైనారిటీకే పదవి దక్కే చాన్స్ ఉండడంతో ఆ వర్గానికి చెందిన మహిళలు పోటీ పడుతున్నట్లు తెలిసింది. 10వ వార్డు కౌన్సిలర్ దిల్‌షాదున్నీసా, 30వ వార్డు సభ్యురాలు గులాబ్‌జాన్ ప్రధానంగా పోటీలో ఉన్నారు. వీరిలో 10వ వార్డు కౌన్సిలర్ వైసీపీ తరఫున గెలిచినా.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అమె.. భర్త కేఎస్ బహుద్దీన్‌తో పాటు టీడీపీలో చేరారు. 30వవార్డు కౌన్సిలర్ గత నెల 23న జరిగిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు. వీరిలో ఒకరు చైర్‌పర్సన్ అయ్యే చాన్స్ ఉన్నట్లు సమాచారం. సోమవారం రాత్రి నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో కూడా చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్ ఎంపిక విషయం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాదికే వదిలినట్లు తెలిసింది. చైర్‌పర్సన్ రేసులో ఉన్న వారు మాత్రం విడివిడిగా కౌన్సిలర్లను కలుస్తున్నట్లు తెలిసింది. వైస్ చైర్మెన్ రేసులో కూడా అనేకమంది ఉన్నట్లు తెలిసింది. సామాజిక సమీకరణాల వారీగా ఇద్దరు వైస్ చైర్మెన్‌ను నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఎన్నిక ముగిసేవరకు ఆయా పార్టీలు.. తమ సభ్యులపై నిఘా పెట్టనున్నట్లు తెలిసింది.



మూడోసారి..

గాండ్లపెంట ఎంపీపీ జగన్మోహన్ రాజీనామాతో ఎన్నిక అనివార్యమైంది. రెండు నెలల క్రితం రెండుసార్లు ఎన్నికకు ఏర్పాట్లు చేశారు. కోరంలేక వాయిదా పడింది. దీంతో మరోసారి ఈనెల 19న ఎన్నిక నిర్వహించనున్నారు. మండలంలోని మొత్తం ఏడుగురు ఎంపీటీసీల్లో ఎంపీపీ రాజీనామాతో ఆరుగురే ఉంటారు. వారిలో నలుగురు వైసీపీ సభ్యులు కాగా, ఇద్దరు టీడీపీకి చెందిన వారున్నారు. వైసీపీ సభ్యుల్లో ఇద్దరు టీడీపీలోకి చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎంపీపీ పీఠం టీడీపీ వశమవుతుందని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

టీడీపీకి ప్రతిష్టాత్మకం

కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్‌తోపాటు గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికను టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. చిన్న పొరబాటుకు కూడా అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికే గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక రెండుసార్లు వాయిదా పడడంతో టీడీపీ పకడ్బందీ ఏర్పాట్లు చేసుకుంటోంది. ఎంపీపీ పీఠాన్ని దక్కించుకునేందుకు వ్యూహం రచిస్తున్నట్లు తెలిసింది. కదిరి చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్ స్థానాలు కూడా టీడీపీకే దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వైసీపీ నుంచి టీడీపీలోకి మరికొంతమంది కౌన్సిలర్లు చేరనున్నట్లు తెలిసింది. రెండు ఎన్నికల్లో విజయం సాధించేందుకు టీడీపీ పావులు కదుపుతోంది. వైసీపీ మాత్రం నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు తెలిసింది. ఆ పార్టీకి దిశానిర్దేశం చేసే నాయకుడే కరువయ్యాడని కార్యకర్తలే చర్చించుకుంటున్నారు.

రేపే అవిశ్వాసం

టీడీపీలో చేరిన 8 మంది వైసీపీ కౌన్సిలర్లు

మడకశిర నగర పంచాయతీపై ఎగరనున్న పచ్చ జెండా!

హైదరాబాద్‌లో క్యాంపులో పలువురు



మడకశిర నగర పంచాయతీ కార్యాలయం

మడకశిర టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే మడకశిర నగర పంచాయతీ పీఠం త్వరలో టీడీపీ కైవసం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనెల 15న మడకశిర నగర పంచాయతీ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు. అందుకు సంబంధించి ఈనెల 15న హాజరు కావాలని ఇప్పటికే కౌన్సిలర్లకు ఆహ్వానం పంపారు. మడకశిర నగర పంచాయతీలో 20 వార్డులు ఉండగా 5 వార్డుల్లో టీడీపీ, మిగిలిన స్థానాల్లో వైసీపీ గెలిచాయి. దీంతో లక్ష్మీనరసమ్మ చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. అయితే గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మడకశిర ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు గెలవడంతో నగరపంచాయతీలో కథ మారింది. గతనెల 23న 13మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి మడకశిర నగర పంచాయతీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని కోరారు, కలెక్టర్ ఆదేశాలతో ఈనెల 15న అవిశ్వాస తీర్మానానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నరసింహరాజేనా..?

అవిశ్వాసం నెగ్గితే 5వ వార్డుకు చెందిన టీడీపీ అభ్యర్థి నరసింహరాజుకు పీఠం దక్కే అవకాశాలు ఉన్నాయనే చర్చ బలంగా సాగుతోంది. వైసీపీకి చెందిన కౌన్సిలర్లలో 8మంది ఇప్పటికే టీడీపీకి జై కొట్టారు. దీంతో టీడీపీ బలం 13కి పెరిగింది. ఎమ్మెల్యే ఓటు కూడా కలిసి రావడంతో చైర్మన్ మార్పు తథ్యం అనే చర్చ పట్టణంలో సాగుతోంది. టీడీపీకి వైసీపీ కౌన్సిలర్లు బహిరంగంగా మద్దతు పలుకుతుండటంతో మార్పు లాంఛనమే అన్న ప్రచారం సాగుతుంది. వైసీపీలో వర్గ పోరు తారస్థాయికి చేరడంతో కొంత మంది కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు ఇస్తున్నట్లు సమాచారం.

క్యాంపునకు తరలిన 13మంది కౌన్సిలర్లు

ఈనెల 15న మడకశిర నగర పంచాయతీలో అవిశ్వాస తీర్మానం ఉండటంతో 13మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌కు విహార యాత్రకు వెళ్లినట్లు సమాచారం. 15న ఉదయం నేరుగా మడకశిర నగర పంచాయతీ కార్యాలయంలో జరిగే అవిశ్వాస తీర్మానానికి వారు హాజరవుతారని తెలిసింది. కాగా వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 8మంది కౌన్సిలర్లు తాము ఎవరి ఒత్తిడి వల్ల పార్టీ మారలేదన్నారు. పార్టీలోని వర్గపోరు, చైర్‌పర్సన్ తనయుడి పెత్తనం భరించలేకే టీడీపీకి మద్దతు ఇవ్వడంతో పాటు అవిశ్వాస తీర్మానానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు.

నేరపరిశోధనలో ఫోరెన్సిక్ ఆధారాలే కీలకం: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత ఊపందుకున్న ప్రస్తుత తరుణంలో నేరపరిశోధన, కేసుల దర్యాప్తులో ఫోరెన్సిక్ ఆధారాలు ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఫోరెన్సిక్ సైన్సు ఎవిడెన్సు మేనేజ్‌మెంట్ వర్క్‌షాపు నిపుణులతో ఒక్కరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమైన కేసుల దర్యాప్తునకు ఫోరెన్సిక్ ఆధారాలు కీలకమన్నారు. పోలీసు అధికారులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని దర్యాప్తు పద్ధతులపై లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫోరెన్సిక్ శిక్షణ వలన ఆధారాల సేకరణ, వాటి విలువపై స్పష్టత కల్గి నేరవిచారణపై బలమైన ఆధారాలను సేకరించే శక్తి వస్తుందన్నారు. ఫోరెన్సిక్ నిపుణులు అనంతపురం ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్ ఫోరెన్సిక్ సైంటిఫిక్ అధికారి కుళ్లాయమ్మ, అశోక్‌కుమార్, మంగళగిరి నుంచి వచ్చిన ఎఫ్‌ఎస్‌ఎల్ సైంటిఫిక్ అసిస్టెంట్లు మురళీ, వెంకటేశ్వరరావులు పోలీసు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఫోరెన్సిక్ నిపుణులకు జిల్లా ఎస్పీ మెమెంటోలను అందచేసి సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌కుమార్, ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఫింగర్‌ప్రింట్ ఎస్సై అనిల్‌కుమార్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు సైబర్ పోలీసు సిబ్బంది, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫోరెన్సిక్ శిక్షణ అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ రత్న

చవితికి సన్నాహాలు చేసుకోండి: జేసీ

పుట్టపర్తి టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రానున్న వినాయ చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించడానికి సన్నాహాలు చేసుకోవాలని జేసీ అభిషేక్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్వో విజయసారథితో కలిసి కదిరి ప్రాంతానికి చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో మంగళవారం ఆయన సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ.. రానున్న వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి ఉత్సవ కమిటీ సభ్యులు అధికారులకు సహకరించాలన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితుల దృష్ట్యా సామరస్యంగా ఈవేడుకలు నిర్వహించుకోవడానికి ప్రతిఒకరు సహకరించాలన్నారు. సహజ సిద్ధమైన పదార్థాలు, మట్టితో వినాయక విగ్రహాల తయారీని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో కదిరి ఆర్డీవో వీవీఎస్ శర్మ, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్, తహసీల్దార్ మురళీకృష్ణ, జిల్లా విపత్తు నివారణ శాఖ అధికారి హేమంత్‌రెడ్డి, దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ నరసింహరాజు, కదిరి గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

బంగారు బిడ్డలు..!

జేఎన్‌టీయూలో బీటెక్ విద్యార్థులకు బంగారు పతకాలు

ఆరు పతకాలతో అదరగొట్టిన పూజిత్‌కుమార్ రెడ్డి

17న రాష్ట్ర గవర్నర్ నుంచి అందుకోనున్న విద్యార్థులు



అనంతపురం సెంట్రల్, మే 13(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 17న నిర్వహిస్తున్న స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా వీటిని అందుకోనున్నారు. 2024-25 సంవత్సరానికి బీటెక్ టాపర్స్‌గా ఏడుగురు విద్యార్థులు నిలిచారు. అందులో ఐదుగురు బాలికలు బంగారు పతకాలను సాధించడం గమనార్హం. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి ఏకంగా ఆరు బంగారు పతకాలు సాధించారు. జేఎన్టీయూ పులివెందుల కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులు పతకాలకు ఎంపికయ్యారు. వర్సిటీ అనుబంధ ప్రైవేట్ కళాశాలల నుంచి 12మంది బంగారు పతకాలు అందుకోనున్నారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల మెడల్స్ వివరాలు..

విద్యార్థి	బ్రాంచ్	సీజీపీఏ	మెడల్స్
నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి	మెకానికల్ ఇంజనీరింగ్	87.73	6
సుప్రియ	కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్	87.62	4
గువ్వల వాల్మీకి హరిత	సివిల్ ఇంజనీరింగ్	86.48	3
పటాన్ ఫహద్ అలి	ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్	85.51	3
శ్రీ వైష్ణవి	ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్	84.14	2
జాహ్నవి	కెమికల్ ఇంజనీరింగ్	84.78	2
పి.వనతి	మెకానికల్ ఇంజనీరింగ్	87.73	1

ప్రభుత్వ రంగ ఉద్యోగిగా..



ప్రభుత్వ రంగంలో ఉన్నతస్థాయి ఉద్యోగిగా పేదలకు సేవలందించాలన్నది అమ్మ, నాన్న ఆకాంక్ష. వారి కలలు నెరవేర్చేలా ఏపీపీఎస్సీ, ఎస్ఎస్సీ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. మాది నెల్లూరు నగరం. అమ్మ నాగలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. నాన్న కరుణానిధి ప్రైవేటు ఉద్యోగి. విద్యార్థులను ప్రోత్సహించేలా కళాశాల అధికారులు ప్రణాళిక బద్ధంగా సెమినార్స్, ప్రాజెక్టులు నిర్వహించి నైపుణ్యాలను వెలికితీస్తున్నారు.

-శ్రీ వైష్ణవి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, రెండు గోల్డ్ మెడల్స్

ఉన్నత ఉద్యోగమే లక్ష్యం



ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)లో అత్యున్నత స్థాయి ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. మాది కడప జిల్లా యర్రగుంట్ల. అమ్మ మంజుల గృహిణి. నాన్న బ్రహ్మంరెడ్డి ప్రైవేట్ కంపెనీలో రోజుకూలీగా పని చేస్తారు. గత డిసెంబరులో కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. ఇంటర్వ్యూలో ప్రతిభ కనబర్చడంతో ఉద్యోగానికి ఎంపికయ్యా. రూ.6లక్షల వార్షిక వేతనంతో ఎల్అండ్‌టీ కంపెనీలో ట్రైనీ ఇంజనీర్‌గా పని చేస్తున్నా.

- నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్, ఆరు గోల్డ్ మెడల్స్

సాఫ్ట్‌వేర్ మేనేజర్‌గా..



గూగుల్ వంటి సంస్థల్లో అంతర్జాతీయ స్థాయిలో సాఫ్ట్‌వేర్ మేనేజర్‌గా పని చేయాలన్న ప్రణాళిక పెట్టుకున్నా. మాది చిత్తూరు జిల్లా, ఐరాల మండలం, బీఎస్ అగ్రహారం. అమ్మ ఉషారాణి, నాన్న శ్రీనివాస్ ఇద్దరూ కిరాణాకొట్టు నిర్వహిస్తున్నారు. వారి ఆశలు నెరవేర్చేలా బీటెక్‌లో మంచి సీజీపీఏను సాధించా. కళాశాలలోని మా విభాగాధిపతి డాక్టర్ కేఎఫ్ భారతి ప్రోత్సాహం మరువలేనిది. రూ.6లక్షల వార్షిక వేతనంతో బెంగళూరులోని డెలాయిట్ కంపెనీలో అనలిస్ట్‌గా పనిచేస్తున్నా.

- తయ్యూరు సుప్రజ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, నాలుగు గోల్డ్ మెడల్స్

గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా



ఆంధ్రా యూనివర్సిటీలో ఎంటెక్ చదువుతూ.. ఏపీపీఎస్సీ గ్రూప్స్, ఎస్ఎస్సీ జేఈ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. మాది అనంతపురం. అమ్మ గౌరి గృహిణి. నాన్న కృష్ణ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. బీటెక్ ప్రథమ సంవత్సరం తోటి విద్యార్థుల్లాగే సాధారణ సీజీపీఏ వచ్చింది. అయితే మా విభాగాధిపతి అజిత ప్రోత్సాహంతో చివరి సంవత్సరం వచ్చేసరికి 86.48 తగ్గకుండా మెరిట్‌లో పాస్ అవుతూ వచ్చా. కళాశాలకు ఎంతో రుణపడివుంటా.

- గువ్వల వాల్మీకి హరిత, సివిల్ ఇంజనీరింగ్, మూడు గోల్డ్ మెడల్స్.

ఐఈఎస్‌లో ర్యాంకే లక్ష్యం



ఐఏఎస్, ఐపీఎస్ తరహాలో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్(ఐఈఎస్)లో ర్యాంక్ సాధించాలని లక్ష్యాన్ని పెట్టుకున్నా. మాది కదిరి పట్టణం. అమ్మ ముంతాజ్, గృహిణి. నాన్న మహబాషా టైలర్‌గా పని చేస్తున్నారు. మహారాష్ట్ర పూణేలోని టీసీఎస్‌లో పని చేస్తున్నా. కళాశాలలో అనుభవం కల్గిన ఫ్యాకల్టీ బోధనతో విద్యార్థులు సులువుగా మెరిట్‌ను సాధిస్తున్నారు. ప్రైవేట్ సంస్థలతో ఎంఓయూలు చేసుకుని క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా మాలాంటి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

- పటాన్ పహద్ అలి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మూడు గోల్డ్‌మెడల్స్

నేటి నుంచి దుర్గాంబ జాతర

ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



మూలవిరాట్ నసనకోట దుర్గాంబ

రామగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలో నసపకోట సమీపంలో వెలసిన దుర్గాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 64 సంవత్సరాల తర్వాత జాతర నిర్వహిస్తుండటంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం నుంచి 18వతేదీ వరకు జాతరను నిర్వహించనున్నారు. ఈ జాతర రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్ ఆధ్వర్యంలో నసనకోట, వెంకటాపురం, గంగంపల్లి గ్రామాల ప్రజల సహకారంతో నిర్వహించనున్నారు. దాదాపు రూ.కోటికిపైగా వెచ్చించి ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. బుధవారం హరియాన్ చెరువు నుంచి పాలకావిడి వచ్చే కార్యక్రమం నిర్వహిస్తారు. అదే రోజు దుర్గాంబ, ముత్యాలమ్మ గ్రామ దేవతలకు దుర్గాంబ చెలిమలో గంగపూజ నిర్వహిస్తారు. 15న ఉత్సవ విగ్రహాలను మూడు గ్రామాలలో ఊరేగించనున్నారు. 16న అభయాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ జరుగుతుంది. 17న దుర్గాంబమ్మకు ముత్తవకుంట్ల గ్రామం సరిపూటి వారు అఖండ జ్యోతిని సమర్పిస్తారు. సాయంత్రం మూడు గ్రామాల నుంచి జ్యోతులతో వచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. అదే రోజు రాత్రి కురుబ బెల్లంవారు వండిన బోనాన్ని బళ్లారి వారు తీసుకుని పెద్దమాదిగలు అందరు కలిసి ఊరేగింపుగా గుడి ప్రాంగణానికి చేరుకుంటారు. ఆదివారం అమ్మవారికి పెద్దఎత్తున జ్యోతులు, బోనాలు సమర్పించి కార్యక్రమాలు ముగిస్తారు. ఈ ఐదు రోజుల పాటు అక్కడ హోమాలు, యజ్ఞాలు కూడా నిర్వహించనున్నారు. దుర్గాంబ జాతర చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, గ్రామస్థులు కృషి చేస్తున్నారు.



గుండుకింద వెలసిన దేవాలయం



ప్రతిష్ఠించనున్న అభయాంజనేయ స్వామి విగ్రహం

సొంతూరిలోనే పరిశ్రమ పెట్టండి

- పుట్టిన ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములవ్వండి
- మంత్రి సవిత పిలుపు
- పెనుకొండ వద్ద ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమిపూజ



ఎంఎస్ఎంఈ పార్కుకు భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఎక్కడెక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు.. సొంతూరులోనే పెట్టాలని ఔత్సాహికులు, యువతకు బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. పుట్టిన ప్రాంత అభివృద్ధిలో భాగస్వాము లు కావాలన్నారు. పెనుకొండ సమీపంలోని రొద్దం ప్లేట్లపై 59.37 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుకు మంత్రి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ పార్కులో తొలి విడత 20 ఎకరాల్లో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 115 పరిశ్రమలకు ఏడు సెంట్ల చొప్పున భూమి కేటాయిస్తున్నామ న్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పారిశ్రామికరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా అడ్డుకోవడంతోపాటు ఉన్నవాటిని కూడా ఇక్కడి నుంచి వెళ్లిపోయేలా చేసిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని మంత్రి వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం సుహానాసోనీ, తహసీల్దార్ శ్రీధర్, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఇంటికొక పారిశ్రామికవేత్త తయారుకావాలి

- ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

పుట్టపర్తిరూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఇంటికొక పారిశ్రామిక వేత్త తయారుకావాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రం పరిధి కప్పలబండ సమీపాన ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కును కలెక్టర్ టీఎస్ చేతన్, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 104 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో రూ.154 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా పారిశ్రామికవాడను తీర్చిదిద్దుతామన్నారు. మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపుతో కప్పలబండలో 104 ఎకరాలను సేకరించి, పారిశ్రామికవాడ ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని నిర్ణయించారన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నాశనం చేసిందన్నారు.

ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో ఈ ప్రాంత అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నపెద్దన్న, ఆర్డీఓ సువర్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ, ఎంపీపీ రమణారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాక పుట్టిస్తున్న కొత్త రూల్స్..!

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజనకు శ్రీకారం

- జీవోలు 19, 20, 21 విడుదల చేసిన విద్యాశాఖ
- 96 యూపీ స్కూళ్లు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్
- 554 ఎస్ఏ పోస్టులు పీఎస్ హెచ్ఎంలుగా కన్వర్షన్
- ఉమ్మడి జిల్లాకు కొత్తగా 437 క్రియేషన్ పోస్టులు
- ఉపాధ్యాయ సంఘాల నేతల నుంచి విమర్శలు
- డీఈఓకు నేతల నుంచి వినతుల వెల్లువ





డీఈఓకు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం యూనియన్ నేతల వినతి, స్కూళ్లు, పోస్టుల వివరాలు ప్రకటించాలని పీఆర్టీయూ నేతల వినతి

అనంతపురం విద్య, మే 13(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజన ఉత్తర్వులు ఉపాధ్యాయులు, సంఘాల నేతల్లో కాక పుట్టిస్తున్నాయి. ప్రభుత్వం మంగళవారం జారీ చేసిన జీవోలు 19, 20, 21, ఉపాధ్యాయులకు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మెజార్టీ ఉపాధ్యాయులు, సంఘాల నేతల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 554 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ హెచ్ఎంలుగా/స్కూల్ అసిస్టెంట్స్‌గా కన్వర్షన్ చేశారు. కొత్తగా జిల్లాకు 437 పోస్టులను సర్దుబాటు చేయనున్నారు. అదే విధంగా 96 అప్పర్ ప్రైమరీ స్కూళ్లను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ జీవోలు జారీ చేశారు.

96 స్కూళ్లు అప్‌గ్రేడ్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 96 అప్పర్ ప్రైమరీ స్కూళ్లను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. హిందూపురం మండలంలో 10, రాయదుర్గంలో 9, అనంతపురం మండలంలో 8 పాఠశాలలు, తాడిపత్రిలో 6, విడపనకల్లు, కదిరిలో 5 చొప్పున, బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, ఉరవకొండ మండలంలో 4 చొప్పున, కణేకల్లు, మడకశిర, బుక్కపట్నం మండలాలలో 3 చొప్పున, బెళుగుప్ప, బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం, కళ్యాణదుర్గం, కూడేరు, లేపాక్షి, పెనుకొండ, గుత్తి మండలాలలో రెండు చొప్పున, ఆత్మకూరు, చిలమత్తూరు, ధర్మవరం, గాండ్లపెంట, గోరంట్ల, గుంతకల్లు, ఓడీసీ, పామిడి, రొద్దం, శెట్టూరు, వజ్రకరూరులో ఒక్కొక్క పాఠశాలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు.

స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కన్వర్షన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ హెచ్ఎంలుగా/స్కూల్ అసిస్టెంట్స్‌గా కన్వర్షన్ చేశారు. మొత్తంగా 554 పోస్టులను కన్వర్షన్ చేశారు. ఇందులో ఎస్ఏ పోస్టులు 520 కాగా, మరో 34 స్కూల్ అసిస్టెంట్ తత్సమానమైన పోస్టులు ఉన్నాయి. స్కూల్ అస్టింట్ పోస్టులు 520లో జడ్పీ, మండల పరిషత్‌లో 515, ప్రభుత్వ పాఠశాలల్లో 5 పోస్టులను కన్వర్షన్ చేశారు. 34 స్కూల్ అసిస్టెంట్ తత్సమానమైన పోస్టుల్లో జడ్పీ, ఎంపీపీ స్కూళ్ల నుంచి 31 పోస్టులు, గవర్నమెంట్ నుంచి 3 పోస్టులను కన్వషన్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ లేదా స్కూల్ అసిస్టెంట్లుగా కన్వర్షన్ ఇవ్వడంపై మెజార్టీ టీచర్లు, సంఘాల నేతల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యూపీ స్కూళ్లలోని సబ్జెక్టు టీచర్లను తీసుకెళ్లి ప్రైమరీలో బోధన చేయించడం ఏమిటని మండిపడుతున్నారు.

కొత్తగా 437 పోస్టుల సర్దుబాటు

ఉమ్మడి జిల్లాకు కొత్తగా 437 పోస్టులను సర్దుబాటు చేయనున్నారు. క్రియేషన్ కమ్ డైరెక్టర్ (హెచ్ఓడీ) పూల్ నుంచి జిల్లాకు 437 పోస్టులను ఇవ్వనున్నారు. ఇందులో 78 హెచ్ఎం పోస్టులు ఉన్నాయి. అందులో ఎంపీపీ స్కూళ్లలో 54, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో 5, మున్సిపాలిటీల్లో 19 పోస్టులు ఇవ్వనున్నారు. స్కూల్ అసిస్టెంట్లు 359 పోస్టులు సర్దుబాటు చేయనుండగా, అందులో ఎంపీపీ స్కూళ్లలో 93, గవర్నమెంట్‌లో 6, మున్సిపాల్ కార్పొరేషన్‌లో47 పోస్టులు, మున్సిపాలిటీల్లో 213 పోస్టులు సర్దుబాటు చేయనున్నారు. విద్యాశాఖాధికారుల సమాచారం మేరకు డైరెక్టర్ పూల్ ద్వారా ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు కొత్తగా 437 పోస్టులను సర్దుబాటు చేస్తారని స్పష్టమవుతోంది.

కొత్త రూల్స్‌పై విమర్శలు

కొత్త ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్ల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలు సంఘాల నేతలు డీఈఓను వేర్వేరుగా కలసి అభ్యంతరం తెలిపారు. ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు డీఈఓను కలిశారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు రమణ, మర్రిస్వామి, జిల్లా అధ్యక్షులు నారాయణస్వామి, జిల్లా ప్రధానకార్యదర్శి రమణ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుతం పనిచేస్తున్న పీఎస్ హెచ్ఎంలకు బదిలీల్లో స్థానాలు కేటాయించిన తర్వాతనే స్కూల్ అసిస్టెంట్స్‌కు పీఎస్ హెచ్ఎంలుగా కన్వర్షన్ ఇవ్వాలని అన్నారు. గత బదిలీల్లో రేషనలైజేషన్ కారణంగా 8 ఏళ్లలోపే బదిలీ అయ్యి, త్వరలో జరిగే బదిలీల్లో రేషనలైజేషన్‌కు గురయ్యే ప్రైమరీ హెచ్ఎంలకు పాత స్టేషన్ పాయింటు కేటాయించాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డీఈఓను కలసి , బదిలీల్లో అసంబద్ధ అంశాలను పరిష్కరించాలని కోరారు. సీనియారిటీ జాబితాలు, దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల వివరాలు, గతంలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉపయోగించుకున్న వారి వివరాలను, సర్దుబాటు ప్రక్రియలో ఎఫెక్ట్ అయిన టీచర్ల వివరాలు, కొత్తగా అప్‌గ్రేడ్ అయ్యే స్కూళ్లు, పోస్టుల వివరాలు ప్రకటించాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు.

దంచికొట్టిన వాన

పొంగిన వాగులు, వంకలు
పలుచోట్ల పంట నష్టం

ఉధృతంగా పారుతున్న చెన్నేకొత్తపల్లి మండలం పెద్దమొగలాయపల్లి వంక



ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, మే 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి తర్వాత వాన దంచికొట్టింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెక్‌డ్యాంలు నిండిపోయాయి. పలు చెరువుల్లోకి నీరు చేరింది. విపరీతమైన ఎండ, ఉక్కపోతతో విలవిల్లాడుతున్న జనం.. వర్షం రాకతో ఉపశమనం పొందారు. భూగర్భ జల మట్టం పెరుగుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. కొత్తచెరువు మండలంలోని వేములేటిపల్లి వద్దనున్న చెక్ డ్యాం పొంగిపొర్లింది. చెన్నేకొత్తపల్లి మండలంలోని పెద్దమొగలాయపల్లి, ప్యాదిండితోపాటు పలు చిన్నచిన్న వంకలు కూడా ప్రవహించాయి. నాగసముద్రం, మేడాపురం తదితర చెరువుల్లోకి కొంతమేర నీరు చేరింది. రామగిరి చెరువులోకి నీరు చేరింది.

పిడుగు పడి పేలిన ఇన్వర్టర్

విడపనకల్లు మండలంలోని ఆర్ కొట్టాల గ్రామంలోని రామాలయం లోగల ఓ గది పక్కనే ఉన్నవేప చెట్టుపై పిడుగు పడింది. చెట్టుకు ఆనుకుని ఉన్న గదిలోని ఇన్వర్టర్ పేలి పోయింది. ఇంట్లోని స్విచ్ బోర్డులు పేలిపోయాయి. టీవీ, ఫ్రిజ్ కాలిపోయాయి. విద్యుత్ సరఫరా ఆగి పోయింది.

ఏడెకరాల్లో బొప్పాయి పంటనష్టం

ఈదురుగాలులతో కూడిన వర్షానికి గుమ్మఘట్ట మండలం గలగల గ్రామ రైతులు సోమలింగ, రమేష్‌కు చెందిన ఏడెకరాల్లో బొప్పాయి పంట దెబ్బ తింది. దీంతో రూ.10 లక్షల దాకా నష్టం వాటిలినట్లు ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు.

వర్షపాతం నమోదు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. కొత్తచెరువు 77.6, చెన్నేకొత్తపల్లి 74.6, రాప్తాడు 66.4, గుత్తి 61.4, బుక్కపట్నం 59.4, యాడికి 50.0, కంబదూరు 40.4, పుట్టపర్తి 36.2, ధర్మవరం 34.6, నల్లమాడ 24.0, రామగిరి 23.6, శెట్టూరు 22.6, కుందుర్పి 20.6, కదిరి, కనగానపల్లి 15.2, పరిగి 11.6, బుక్కరాయసముద్రం 11.2, అగళి 10.2, విడపనకల్లు 8.8, తలుపుల, రొళ్ల 7.4, ముదిగుబ్బ 6.8, ఓబుళదేవరచెరువు 6.4, నార్పల 6.2, గుమ్మఘట్ట 4.8, గుంతకల్లు, బ్రహ్మసముద్రం, కూడేరు 4.2, బొమ్మనహాళ్ 3.4, పెనుకొండ 2.6, అనంతపురం, బత్తలపల్లి, తాడిమర్రిలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



కొత్తచెరువు మండలం వేములేటిపల్లి వద్ద పొంగిపొర్లుతున్న చెక్ డ్యాం



గుమ్మఘట్ట మండలం గలగల గ్రామంలో దెబ్బతిన్న బొప్పాయి పంటను చూపుతున్న రైతు సోమలింగ



పేలిన ఇన్వర్టర్

భర్తను ముంచేసి ఉడాయించిన భార్య

రూ.80 లక్షలకు పైగా మోసం చేసిందంటూ ఫిర్యాదు



బాధితుడు ఇబ్రహీం ఫయాజ్ బాషా

బెళుగుప్ప, మే13(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడైన భర్తను మోసగించి లక్షలాది రూపాయలతో ఉడాయించింది ఓ భార్య. దీనిపై బాధితుడు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇబ్రహీం ఫయాజ్ బాషా మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఫయాజ్ బాషా పోలియో బారిన పడి దివ్యాంగుడయ్యారు. చేతులు పని చేయడం లేదు. ఆయనకు గుంటూరు జిల్లా తెనాలి వాసి షేక్ షబీనాతో వివాహమైంది. ఆమె జల్సాలకు డబ్బులివ్వాలని భర్తను బెదిరిస్తుండేది. దివ్యాంగుడంటూ వేధిస్తుండేది. ఈ నేపథ్యంలోనే ఫయాజ్ బాషా పేరున బ్యాంకులో రూ.30 లక్షలు రుణం తీసుకుని, షబీనా అక్క జరీనాకు ఇప్పించారు. దౌర్జన్యంగా ఇంటి స్థలాన్ని రూ.41 లక్షలకు అమ్ముకున్నారు. ఐదు తులాల బంగారంతోపాటు రూ.6 లక్షల కారుతో గతనెల 29న పరారయ్యారని బాధితుడు వాపోయారు. దివ్యాంగుడినైన తనను వేధించి, మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

అప్పుల ఉరికి వేలాడిన మరో నేతన్న



చంద్రశేఖర్ (ఫైల్)

కొత్తచెరువు, మే 13(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మరో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు చంద్రశేఖర్ (53) మంగళవారం ఉరేసుకుని, మరణించాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప, చేనేత బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రశేఖర్ కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మగ్గం గిట్టుబాటు కాక, కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ముడిసరుకుల కోసం రూ.5లక్షలు అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలంటూ కుటుంబసభ్యులతో తరచూ అంటుండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం రాత్రి కుటుంబసభ్యులు ఇంటి బయట నిద్రిస్తుండగా.. చంద్రశేఖర్ ఇంట్లో ఉరేసుకుని మరణించాడు. ఉదయం లేచి తలుపులు తీసిన కుటుంబ సభ్యులకు.. చంద్రశేఖర్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. నేతన్న భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నేతన్నకు కుమారుడు కేదార్, కుమార్తె శాంబవి ఉన్నారు.

సిబ్బందిని వేధించడం తగదు

ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలి

ఎన్ఎంయూఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎన్వీ రమణ



ఎన్ఎంయూఏ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

అనంతపురం కల్చరల్, మే 13(ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న కారణాలకే ఏపీఎస్ఆర్టీసీ సిబ్బందిపై అధికారులు వేధింపులకు పాల్పడడం తగదని ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణ పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం రీజియన్‌లోని 7 డిపోల నుంచి ఎన్ఎంయూఏ నాయకులు, సిబ్బంది 'చలో ఆర్ఎం కార్యాలయం' చేపట్టారు. ఆర్ఎం కార్యాలయం ముందు కార్యక్రమంలో ఎన్వీ రమణ మాట్లాడారు. చిన్నచిన్న కారణాలను చూపుతూ సిబ్బంది ప్రమోషన్లు ఆపడం, వేధించడాన్ని ఉన్నతాధికారులు మానుకోవాలన్నారు. ఉద్యోగ భద్రత సర్కులర్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో ఖాళీగా ఉన్న 12వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా ఛైర్మన్ సూరిబాబు, కార్యదర్శి ప్రతాప్ నారాయణ, ఉపాధ్యక్షుడు సదాశివరెడ్డి, నేతలు డీఎన్ రెడ్డి, పుల్లయ్య, శశికళ, రీజియన్‌లోని వివిధ డిపోల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

స్పెషల్‌బ్రాంచ్ ఎస్ఐ సరెండర్

పుట్టపర్తి రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ఎం. ప్రదీప్‌కుమార్‌ను సరెండర్ చేశారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ షీముషి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూల్ రేంజ్ డీఐజీ ముందు రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య అంత్యక్రియలు

బళ్లారి, మే 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య అంత్యక్రియలు బుధవారం బళ్లారిలోని హరిశ్చంద్ర ఘాట్‌లో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం గుండెపోటుతో ఆయన కన్నుమూసిన సంగతి తెలిసిందే. మంగళవారం పుల్లయ్య భౌతిక కాయాన్ని బళ్లారిలోని ఆయన స్వగృహంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. అనంతపురం, కర్నూలు, బళ్లారి, హైదరాబాద్ నుంచి వచ్చిన పలువురు నేతలు, అభిమానులు ఆయనకు నివాళి అర్పించారు.

ఊరుగాని ఊరిలో ఉరి

పుట్టింట ఒక్కరోజూ గడపనివ్వని భర్త

ఇద్దరు కొడుకులు పుట్టినా.. పురిటికీ వెళ్లలేక నరకం

తమ్ముడి నిశ్చితార్థానికి వెళ్లినా మనశ్శాంతి కరువు

అత్తారింటికి వచ్చి.. తాళి, మెట్టెలు తీసేసి అనంతకు..

అర్ధరాత్రి రైల్వే క్వార్టర్స్ వద్ద ఉరి వేసుకున్న అభాగ్యురాలు

కర్నూలు జిల్లా నందవరం కోడలు జీవితం విషాదాంతం



ఉరి వేసుకున్న ఉరుకుందమ్మ, ఇన్‌సెట్‌లో ఉరుకుందమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళితే కనీసం రెండు రోజులు ఉండనివ్వడు. 'నువ్వు అక్కడుంటే నాకు అన్నం వండిపెట్టేది ఎవరు..?' అని వేధిస్తాడు. దీంతో అలా వెళ్లడం, ఇలా రావడం.. పెళ్లైనప్పటి నుంచి ఐదేళ్లుగా ఇదే జరిగింది. ఆమెకు ఇద్దరు పిల్లలు పుట్టినా.. ప్రసవానికి కూడా పుట్టింటికి వెళ్లింది లేదు. బాలింతగా ఓ వారం రోజులు కూడా రక్త సంబంధీకులతో గడిపింది లేదు. తాజాగా తమ్ముడి నిశ్చితార్థానికి వెళ్లి నాలుగు రోజులు ఉందామని అనుకుంది. మామ కూడా అల్లుడితో ఇదే విషయం చెప్పి తీసుకెళ్లాడు. కానీ అల్లుడు మారలేదు. భార్య పుట్టింటికి వెళ్లిందో లేదో.. మరుసటి రోజే ఫోన్ చేసి తిరిగి రమ్మన్నాడు. ఎవరు ఎంత బతిమాలినా వినుకోలేదు. దీంతో కూతురును తండ్రి మెట్టినింట దించివెళ్లాడు. ఇలాంటి జీవితం తనకెందుకు అని అనుకుంది ఆమె..! తాళి, మెట్టెలు, చెవి దిద్దులు ఇంట్లోనే వదిలేసి బయటకు వెళ్లిపోయింది. ఊరుగాని ఊరికి వచ్చి ఉరి వేసుకుంది. అనంతపురం నగరంలోని రైల్వే కార్టర్స్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి బలవన్మరణానికి పాల్పడింది.

గుర్తు తెలియని మహిళ..

అనంతపురం నగరంలోని మొదటి రోడ్డు రైల్వే క్వార్టర్స్ పక్కనే ఉన్న స్థలంలో ఓ మహిళ చెట్టుకు చీరతో ఉరి వేసుకుంది. స్థానికులు మంగళవారం ఉదయం గమనించి, అక్కడ గుమిగూడారు. ఎవరూ ఆమెను గుర్తు పట్టలేకపోయారు. ఉదయం 7.30 గంటల సమయంలో అనంతపురం త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శరత్‌చంద్ర సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆమె అరచేతిలో ఓ ఫోన్ నంబర్ కనిపించడంతో.. కాల్ చేశారు. ఆ మహిళ పేరు ఉరుకుందమ్మ(24) అని, ఆ నంబర్ ఆమె భర్త పంపయ్యదని తేలింది. కర్నూలు జిల్లా నందవరం మండల కేంద్రానికి చెందిన ఆమె.. అనంతపురం నగరానికి రైలులో వచ్చి, ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించారు. మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన ఆమె తండ్రి ఈరన్నకు సమాచారం అందించారు.

పుట్టింటికి దూరమై...

మాధవరం గ్రామానికి చెందిన ఈరన్న భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. ఆయనకు కూతురు ఉరుకుందమ్మ, కుమారుడు నాగరాజు సంతానం. ఐదేళ్ల క్రితం నందవరం మండల కేంద్రానికి చెందిన పంపయ్యతో ఉరుకుందమ్మకు వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఈరన్న(రెండున్నరేళ్లు), తరుణ్ కుమార్ (3నెలలు) ఉన్నారు. పెళ్లయినప్పటి నుంచి ఉరకుందమ్మకు పుట్టింట్లో కొన్ని రోజులైనా గడిపే అవకాశం రాలేదు. ఒకటి రెండు రోజులకే తిరిగి రావాలని భర్త పంపయ్య పోరు పెట్టేవాడు. ఏమైనా అంటే తనకు అన్నం పెట్టేదెవరని గద్దించేవాడు. పంపయ్యకు తనమీద ఉన్నది ప్రేమో, అనుమానమో ఆమెకు అర్థమయ్యేది కాదని కుటుంబ సభ్యులు కంటతడి పెట్టారు. ఆమెకు సెల్‌ఫోన్ కూడా లేదని తెలిపారు. ఇదివరకు గొడవలు జరిగితే మూడు సార్లు పంచాయితీ చేసి తమ కూతురును కాపురానికి పంపామని మృతురాలి తండ్రి, బాబాయి ఆవేదన వ్యక్తం చేశారు.

తమ్ముడి నిశ్చితార్థంలోనూ....

ఉరుకుందమ్మ సోదరుడు నాగరాజుకు వివాహం కుదిరింది. దీంతో బట్టలు పెడతామంటే పది రోజుల క్రితం పుట్టింటికెళ్లింది. రెండు రోజులు ఉండి వచ్చేసింది. ఈ నెల 8న రెండో కుమారుడికి నామకరణం చేశారు. ఈ నెల 10వ తేదీ తమ్ముడు నాగరాజు నిశ్చితార్థం ఉండటంతో 9వ తేదీ పంపయ్య ఆమెను పుట్టింటికి పంపాడు. బావమరిది నిశ్చితార్థం ఉన్నా తాను మాత్రం వెళ్లలేదు. పైగా భార్య పుట్టింటికి వెళ్లిన మరుసటి రోజే మామ ఈరన్నకు ఫోన్ చేశాడు. తన భార్యను పంపించమని అడిగాడు. నాలుగు రోజులు ఉండి, బుధవారం వస్తుందిలే అని చెప్పినా వినుకోలేదు. కుదరదని, తనకు అన్నం పెట్టేవారెవరూ లేరని అన్నాడు. గత్యంతరం లేక ఈరన్న ఆదివారం ఉరుకుందమ్మను వెంటబెట్టుకుని అల్లుడి ఇంట్లో దింపి వెళ్లాడు.

పిల్లలను.. తాళిని అక్కడే ఉంచి...

ఈ నెల 12వ తేదీ ఉదయ 6గంటలకు పంపయ్య తండ్రి నరసింహులు పనికి వెళ్లాడు. 9 గంటల సమయంలో పంపయ్య సిమెంట్ గోడౌన్‌కు పనికోసం వెళ్లాడు. ఆ సమయంలో అత్త మల్లమ్మ, ఉరకుందమ్మ, పిల్లలు మాత్రమే ఇంట్లో ఉన్నారు. ఏం జరిగిందోగాని, 10 గంటల సమయంలో ఉరుకుందమ్మ తాళి, కాలిమెట్టలు, చెవిపోగులు మంచంపై వేసి, అత్తకు కూడా చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆదోని లేదా మంత్రాలయం వెళ్లి అక్కడి నుంచి రైలులో అనంతపురం చేరుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక మొదటి రోడ్డు రైల్వే క్వార్టర్స్ పక్కనున్న స్థలంలో ఓ చెట్టుకు చీరతో ఆమె ఉరి వేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రామగిరిలో వైసీపీకి షాక్

ముగ్గురు ఎంపీటీసీలు.. టీడీపీలోకి చేరిక..

మరికొంతమంది చేరే అవకాశం..

ఎంపీపీ పీఠం సైకిల్ వశమయ్యేనా?



పరిటాల సునీత, శ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ ఎంపీటీసీలు

రామగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో భారీ ట్విస్ట్. ఇటీవల ఎంపీపీ ఎన్నిక సందర్భంగా తమ ఎంపీటీసీలను వైసీపీ నేతలు.. క్యాంపునకు తరలించి, గైర్హాజరయ్యేలా చేశారు. దీంతో కోరంలేక ఎన్నిక వాయిదా వేశారు. త్వరలో మళ్లీ ఎన్నిక నిర్వహించే చర్యలు చేపడుగున్న తరుణంలో వైసీపీకి అనుకోని షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీటీసీలు టీడీపీలోకి చేరిపోయారు. పేరూరు-1, 2 ఎంపీటీసీలు కత్రెన్న, భారతి, మాదాపురం ఎంపీటీసీ సంపత్ తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని వెంకటాపురంలో మంగళవారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సమక్షంలో వారు పసుపు కండువా కప్పుకున్నారు. దీంతో టీడీపీ బలం నాలుగుకు పెరిగింది. ఇంకొంత మంది వైసీపీ సభ్యులు టీడీపీలో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈలెక్కన ఎంపీపీ పీఠం టీడీపీ వశమయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

ఎంపీపీ నాగమ్మ మృతితో ఎన్నిక అనివార్యమైంది. మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఎంపీపీ మృతితో 9 మంది ఎంపీటీసీలు ఉంటారు. వారిలో ఒకరు టీడీపీ తరపున గెలిచారు. 8 మంది వైసీసీ ఎంపీటీసీలు ఉన్నారు. కొన్ని నెలల క్రితం ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడింది. ఎన్నిక రోజున సభ్యులు గైర్హాజరవడంతో వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ ఎన్నికకు మరోసారి నోటిఫికేషన్ వెలువడనుంది. ఈనెల 19న ఎన్నిక జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన ముగ్గురు ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం నాలుగుకు చేరింది. వైసీపీ సభ్యులు ఐదుగురు ఉంటారు. వీరిలో ఇంకొందరు టీడీపీలో చేరుతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అదే జరిగితే.. ఎంపీపీ పీఠం టీడీపీ వశమవుతుంది. గత ఎన్నికల్లో సభ్యులను శిబిరాలకు తరలించి, వాయిదా పడేలా చేసిన వైసీపీ నాయకులు ప్రస్తుత పరిణామాలతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. వైసీపీ తీరుతో విసిగిపోయే టీడీపీలోకి చేరుతున్నట్లు పార్టీ మారుతున్న ఎంపీటీసీలు ప్రకటించారు. ఇటీవల ఎంపీపీ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి.. తమను క్యాంపునకు తరలించి, నిర్బంధించారని వారు స్పష్టం చేశారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నామన్నారు. అందుకే పార్టీలోకి చేరుతున్నామన్నారు.

15న ఎంపీపీ ఎన్నిక నోటిఫికేషన్

రామగిరి ఎంపీపీ ఎన్నికకు ఈనెల 15న నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కమలాబాయి మంగళవారం తెలిపారు. 19న ఎన్నిక ఉంటుందన్నారు. ఆ మేరకు సభ్యులకు నోటీసులు పంపనున్నట్లు ఆమె తెలిపారు.

ఆర్టీసీ బస్సులో గొలుసు చోరీ



ప్రయాణికులను తనిఖీ చేస్తున్న పోలీసులు, బాధితురాలు రత్నమ్మ



బుక్కరాయసముద్రం, మే 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు రత్నమ్మ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు మంగళవారం చోరీ చేశారు. దీంతో బస్సును ఆపి, పోలీసులు తనిఖీలు చేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరంలోని బళ్లారి బైపాస్ సమీపాన నివాసం ఉంటున్న రత్నమ్మ, ఆమె కోడలు సురేఖ తాడిమర్రి మండలం కునుకుంట్ల గ్రామానికి మంగళవారం మధ్యాహ్నం బయల్దేరారు. అనంతపురం బస్టాండులో పార్నపల్లికి వెళ్లే బస్సు ఎక్కారు. బస్సు ఎక్కిన ఐదు నిమిషాలకే రత్నమ్మ మెడలోని ఐదున్నర తులం బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు అపహరించారు. బస్సు కదిలాక గుర్తించిన బాధితురాలు.. బస్సు డ్రైవర్ కుళ్లాయప్ప, కండక్టర్ రమాకాంత్‌కు తెలిపింది. బస్సును నేరుగా బుక్కరాయసముద్రం పోలీసుస్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. విషయం పోలీసులకు తెలిపారు. పోలీసులు.. బస్సులోని ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వారి వద్ద బంగారు గొలుసు లభించలేదు. బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమె బస్సు ఎక్కిన తర్వాత అనంతపురంలోని బస్టాండు వద్ద గుర్తుతెలియని ఐదుగురు మహిళలు అదే బస్సు ఎక్కి దిగి వెళ్లిపోయారని పోలీసులకు తెలిపారు. అనంతపురం త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసును త్రీటౌన్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని ఐదుగురు మహిళల కోసం బస్టాండు వద్దనున్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో బంగారు నగల చోరీ

గుత్తి, మే 13(ఆంధ్రజ్యోతి): తన బ్యాగ్‌లో ఉన్న బంగారు నగలు చోరీ అయ్యాయని ప్రయాణికురాలు సుభాన్‌బీ స్థానిక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కర్నూలుకు చెందిన సుభాన్‌బీ గుంతకల్లులో తన బంధువుల రిసెప్షన్‌కు కుటుంబ సమేతంగా వెళ్లారు. తిరిగి గుంతకల్లు నుంచి గుత్తికి వచ్చేందుకు బస్సు ఎక్కారు. గుత్తిలో బస్సు దిగిన తరువాత తన బ్యాగ్‌లో ఉన్న ఆరు తులాల రెండు బంగారు నెక్లెస్‌లు చోరీ అయినట్లు గుర్తించి, వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ టన్ను రూ. 28వేలు

అనంతపురం రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 28వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5,350, సరాసరి రూ. 15వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 692 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నారా లోకేశ్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



బేతాపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



శాప్ చైర్మన్‌తో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

గుత్తి/రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 15న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటన నేపథ్యంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతపురం రోడ్డులోని మాచినేని పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేస్తున్న సభ ప్రాంగణాన్ని వారు పరిశీలించారు. శాప్ ఛైర్మన్ రవినాయుడుతో పర్యటన ఏర్పాట్ల గురించి వారు చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు ప్రతాప్, చికెన్ శ్రీనివాసులు, రమేష్, యంగన్నపల్లి సర్పంచు భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి: ఎమ్మెల్యే

రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఈ నెల 15, 16న గుత్తి, బేతాపల్లిలో పర్యటించనున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పిలుపు నిచ్చారు. మండలంలోని బేతాపల్లి గ్రామశివారులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. రేన్యూ పవర్ సోలార్ ప్రైవేట్ కంపెనీకి సంబంధించి మంత్రి భూమి పూజ కార్యక్రమ స్థలాన్ని పరిశీలించారు. తర్వాత గుత్తిలో కార్యకర్తల సమావేశం నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్, సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు బర్దీవలి, ఎంకే చౌదరి, టీడీపీ నాయకులు తెలుగు యువత అధికార ప్రతినిధి ప్రతాప్, ఆసుపత్రి కమిటీ సభ్యుడు, చికెన్ శీనా, నాయకులు రమేష్, గోవర్ధన్ గౌడ్, బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్, తహసీల్దార్ ఓబులేసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ 'అంబికా' సోదరి వేదవతి అంత్యక్రియలు

గుంతకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): హెలీక్యాప్టర్ ప్రమాదంలో మరణించిన వేదవతి కుమారి (48) అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోదరి వేదవతి కుమారి, ఆమె భర్త ముష్టూరు భాస్కర్ గంగోత్రి యాత్రకు ఈ నెల 8న బయలుదేరి వెళ్లి హెలీక్యాప్టర్ ప్రమాదానికి గురైన సంగతి విదితమే. ఈ ప్రమాదంలో వేదవతి కుమారి అక్కడికక్కడే మరణించగా, భాస్కర్ తీవ్రగాయాలతో బయటపడ్డారు. భాస్కర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం వేదవతి కుమారి మృతదేహాన్ని గుంతకల్లుకు తెచ్చి మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబికులు తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ భాస్కర్ స్వగృహంలో బంధువుల సందర్శన ఉంటుందని, మధ్యాహ్నం 1 గంటలకు తమ ఫాంహౌస్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ధర్మవరం యార్డు పనులను పరిశీలించిన డీఆర్ఎం

గుంతకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని ధర్మవరం రైల్వే స్టేషన్ యార్డులో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనులను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా మంగళవారం పరిశీలించారు. గుంతకల్లు నుంచి వివిధ శాఖాధికారులతో బయలుదేరి ధర్మవరం వెళ్లిన డీఆర్ఎం నాన్ ఇటర్లాకింగ్ పనులలో భాగంగా లింకింగ్‌లను, సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థలను తనిఖీచేశారు. అంచనాలను అనుసరించి పనులు సకాలంలో పూర్తికావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఈ, సీఎస్‌డీఈ, రైట్స్ శాఖాధికారులు పాల్గొన్నారు.




యార్డు పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ :
99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంట్‌ను సంప్రదించండి.



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 237540

ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్: 9030661651.
AJA- 237538

WANTED

బాల మద్దిలేటి & సన్స్ A/C హేర్‌స్టైల్ & బ్యూటీ సెలూన్ నందు పనిచేయుటకు వర్కర్స్ కావలెను. జీతం.17,000 + భోజనం + రూమ్ సౌకర్యం కలదు. సెల్: 98854 46126, 88974 76747.
AJL-236390

TOLET

డబుల్ బెడ్ రూమ్ ఇల్లు,మంచినీరు పుష్కలం, బాడుగ Rs. 8000/- మాత్రమే. అనంతపురం టౌన్ కళ్యాణదుర్గం రోడ్డుకు Dr. రజాక్ హాస్పిటల్ వద్ద Cont:9951626131.
AJA-226944

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

కనీస సౌకర్యాలూ కరువు




అమడగూరు మండలం మహమ్మదాబాద్ వద్ద ఎండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు, ముళ్లకంపల చెట్ల కింద సేద తీరుతున్న కూలీలు

● ఎండలోనే ఉపాధి పనులు
● ఇబ్బందులు పడుతున్న కూలీలు
● అందని పనిముట్లు

అమడగూరు (కదిరి), మే 13(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలో ఉపాధి పనులు చేపట్టే ప్రాంతాల్లో అధికారులు కనీస సౌకర్యాలూ కల్పించడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి పనుల ప్రాంతాల్లో నీరు, నీడ కల్పించడంతో పాటు మెడికల్ కిట్లు, పనిముట్లు అందుబాటులో ఉంచాయి. కాని కూలీలకు అధికారులు ఈ సౌకర్యాలు ఏవీ కల్పించడం లేదు. అసలే ఎండాకాలం. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఈ సమయంలోనూ ఉపాధి పనులు చేసే ప్రాంతాల్లో నీడ సౌకర్యం కల్పించడం లేదు. దీంతో కూలీలు ఎండలోనే ఆ పనులు చేస్తూ.. సొమ్మసిల్లి పడిపోతున్నారు. కొందరు వడదెబ్బకు గురవుతున్నారు. వారి ఆరోగ్యంలో కూడా దెబ్బతింటోంది.

● ఎండలోనే పనులు

మండలంలో జాబ్‌కార్డుల ప్రకారం దాదాపు ఆరువేల మంది కూలీలున్నారు. పది పంచాయతీలోనూ ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టారు. దీంతో దాదాపు రెండు వేల మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నీడ కోసం షామియాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా .. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నీడ, నీరుతో పాటు తమకు పనిముట్లు అందజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ కూలీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి పని కోసం దాదాపు ఒకటిన్నర కిలోమీటరు దూరం వెళ్తున్నాం. నీరు, పనిముట్లు తీసుకొని వెళ్తున్నాం. వెళ్లి రావడానికే సమయం సరిపోతోంది. నీరు, నీడ సౌకర్యాలు కల్పించడం లేదు. పనిముట్లు కూడా ఇవ్వడం లేదు.

- నరసింహులు, మహమ్మదాబాద్

ఉత్తర్వులు అందలేదు

ఉపాధి పనులు చేసే ప్రాంతాల్లో నీడ కల్పించి.. పనిముట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేవు. ఉత్తర్వులు అందిన వెంటనే కూలీలకు ఆ సౌకర్యాలు కల్పిస్తాం. తాగునీటికి అయ్యే ఖర్చును వారి కూలితో పాటు ఇస్తున్నాం.

- మధుసూధన్‌రెడ్డి, ఏపీఓ

మైనార్టీలకు అండగా ఉంటా

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



ధర్మవరం, మే 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా మైనార్టీల అస్తిత్వానికి ప్రమాదం వచ్చినా .... తాను అక్కడికి వెళ్లి.. వారికి అండగా ఉంటానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. ధర్మవరం సమీపంలో సీతారాంపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ డాబా యజమానిపై సోమవారం రాత్రి కొందరు యువకులు దాడి చేశారు. వారిని అడ్డుకోబోయిన ధర్మవరం మైనార్టీ యువకులు దాదాఖలందర్, సౌదిబాబాలపై కూడా వారు దాడి చేశారు. ఈ ఘటనపై సోమవారం రాత్రి పట్టణంలో ముస్లింలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. దీనిపై మంగళవారం లక్ష్మీచెన్నకేశవపురంలోని టీడీపీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడారు. సోమవారం రాత్రి తనకీ విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ హేమంత్‌కుమార్, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌తో ఫోన్ మాట్లాడానన్నారు. కారకులను అరెస్ట్ చేసి.. చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. అయితే ఈ దాడి విషయాన్ని కొందరు తప్పుదోవ పట్టించడానికి యత్నించారని, వారికి అనుకూలంగా మార్చుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేశారని అన్నారు. అయితే తాను వెంటనే స్పందించడంతో వారు కుటిల ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. తాను అంజనేయస్వామి ఎలా ఆరాధిస్తానో.. అల్లానూ అలాగే ఆరాదిస్తానని స్పష్టం చేశారు. దీనిపై బాధితుడు దాదాఖలందర్ మాట్లాడుతూ.. సోమవారం రాత్రి డాబాలో తనపట్ల కొందరు వ్యక్తులు అనుచితంగా వ్యవహరించారని, పరిటాల శ్రీరామ్ అర్ధరాత్రి 12 గంటల సమయంలో తనకు ఫోన్ చేసి ధైర్యంచెప్పి .. అండగా నిలిచారని చెప్పారు.

●ఆరుగురిపై కేసు

ధర్మవరంరూరల్ : మండలంలోని సీతారంపల్లి క్రాస్ వద్ద పంజాబీ డాబాలో జరిగిన ఘర్షణపై రూరల్ పోలీసులు ఆరుగురుపై కేసు నమోదు చేశారు. కనగానపల్లి మండలం కుర్లపల్లి, చంద్రాచెర్లకు చెందిన చంద్ర, నాగార్జున, నరసింహులు, కేశవ, వెంకటేష్, రేగాటిపల్లి మహేష్ ఆ డాబాలో సోమవారం రాత్రి ఉన్నారు. అదే సమయంలో ధర్మవరానికి చెందిన దాదాఖలందర్ తన స్నేహితులతో కలిసి ఆ డాబాకు వచ్చాడు. ఆ యువకులు అతనితో గొడవ పెట్టుకొని .. దా డి చేశారు. దీంతో దాదాఖలందర్ ధర్మవరం వెళ్లి తన బంధువులకు తెలియజేయడంతో వారు అర్ధరాత్రి రాస్తారోకో నిర్వహించారు. దాదాఖలందర్ ఫిర్యాదు మేరకు ఆ ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.



వైసీపీ నేత కోటిరెడ్డికి చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే

పార్టీలకు అతీతంగా సీఎం సహాయ నిధి

నల్లచెరువు/కదిరి, మే 13(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా సీఎం సహాయ నిధి మంజూరయ్యేలా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చొరవ చూపారు. నల్లచెరువు మండలం ఎం.అగ్రహారానికి చెందిన వైసీపీ నాయకుడు కోటిరెడ్డి గతంలో గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ఆర్థిక సాయం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అతనికి రూ.2,28,323 మంజూరైంది. ఇతనితో పాటు నియోజకవర్గంలోని మరో 17 మందికి సీఎం సహాయ నిధి మంజూరైంది. వీరందరికీ మొత్తం రూ.16,32,664 మంజూరు కాగా, మంగళవారం కదిరి ఆర్‌అండ్ అండ్‌బీ బంగాల్లో బాధితులకు ఆయా చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. దీంతో వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజశేఖర్‌బాబు, మోపూరిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సైనికుల కోసం జనసైనికుల పూజలు



కుక్కె సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం వద్ద జనసేన నాయకులు

ధర్మవరం, మే 13(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు భారత సైనికులకు భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కర్ణాటకలోని కుక్కె సుబ్రహ్మణ్యంస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేయించారు. ఇందులో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మిద్దె పైనుంచి పడి బీటెక్ విద్యార్థి మృతి



రూపేంద్ర (ఫైల్)

ముదిగుబ్బ, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకవేముల క్రాస్‌లో సోమవారం రాత్రి మిద్దె పైనుంచి పడి బీటెక్ విద్యార్థి రూపేంద్ర (21) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మలకవేముల క్రాస్‌కు చెందిన బండి మల్లికార్జున కుమారుడు రూపేంద్ర పంజాబ్‌లోని ఓ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతుండేవాడు. సెలవులు వదలడంతో స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం రాత్రి మిద్దెపై పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో వర్షం మొదలవడంతో హడావుడిగా దిగే క్రమంలో అదుపు తప్పి మిద్దె పైనుంచి కింద పడ్డాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రైవేటు వాహనంలో కదిరి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రూపేంద్ర మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు కళ్ల ముందే చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

టీడీపీని బలోపేతం చేయండి : పల్లె



మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

నల్లమాడ, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక షాదీమహల్‌లో కార్యకర్తలతో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల కృషితోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. 2029లోపు అన్ని చెరువులకు నీరు ఇచ్చి, నియోజకవర్గానికి మరో కోస్తా ఆంధ్రగా మార్చుతామన్నారు. అనంతరం మండలంలో గ్రామ, సాధికార సారధి, బూత్ కమిటీలను, అధ్యక్షులు, కన్వీనర్లు, కో కన్వీనర్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, సర్పంచ్‌లు భారతి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, ఎల్‌ఐసీ నరసింహులు, గడ్డం రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పుట్టపర్తిటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం ఆందోళన బాట పట్టారు. జిల్లాలోని ఆరు డిపోల ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పుట్టపర్తి జిల్లా ప్రజా రవాణా కార్యాలయం వద్ద ఈ ఆందోళన చేపట్టారు. పుట్టపర్తి డిపో నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎంయూ రాష్ట్ర కార్యద ర్శి ఎర్రిస్వామి మాట్లాడుతూ.. సంస్థ ఉద్యోగులను చిన్నచిన్నకారణాలతో అధికారులు వేధించడం తగదన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న 12వేల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. మహిళ ఉద్యోగులకు రావాల్సిన చైల్డుకేర్ సెలవులు వెంటనే మంజూరు చేయాలన్నారు. గ్యారేజీ సిబ్బందిపై వేధింపులు సరికాదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నాగరాజు, నాగశేఖర్, శ్రీరామనాయక్, రాజారెడ్డి, తిరుపతమ్మ, విజయలక్ష్మీ, గంగన్న పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

నల్లమాడ, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక చెత్త సంపద కేంద్రాన్ని డీపీఓ సమత మంగళవారం పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి చెత్త సంపద కేంద్రంలో ఎరువులు తయారు చేయడానికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం బస్టాండ్ నుంచి బాలాజీ పాఠశాల వరకు ఉన్న మురుగునీటి కాలువను శుభ్రం చేయించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్మికులు ఉన్నారు.



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

న్యూస్ బాక్స్

ఘనంగా బండ్ల మెరవణి



ఆంజనేయస్వామి

గాండ్లపెంట, మే 13(ఆంధ్రజ్యోతి): ములకల పౌర్ణమి సందర్భంగా మండలంలోని మునలవారిపల్లి, కోటూరు, వంకపల్లి గ్రామాల్లో బండ్ల మెరవణి కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. తూపల్లి పంచాయతీలోని మురగలవారిపల్లి ఆలయం, కోటూరు ఆలయం, వంకపల్లి మారెమ్మ ఆలయాల్లో భక్తులు అమ్మవారికి ఎద్దుల బండ్లకట్టి పానక పన్నారంతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమం తిలకించడానికి చుట్టుపక్కల గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వార్డు సచివాలయాల తనిఖీ

ధర్మవరం, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరానగర్, పీఆర్‌టీ, గీతానగర్ వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. సచివాయాల్లో రికార్డులు సరిగా నిర్వహించడం లేదని, విధులకు సరిగా హాజరు కాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై ప్రతి రోజూ సచివాలయాల తనిఖీ చేస్తానని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా వనితావాణి



ధర్మవరం, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా వనితావాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీకాంతరెడ్డి రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి మహాలక్ష్మీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్‌గా కొనసాగారు. ఈ క్రమంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా పనిచేస్తున్న వనితావాణిని ఉద్యోగోన్నతిపై బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమించింది. కళాశాల అధ్యాపకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

సమ్మె జయప్రదం చేయండి

ఓబుళదేవరచెరువు, మే 13(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యలపై తలపెడుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం అంబేడ్కర్ సర్కిల్‌లో సమ్మె పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు వీవీ రమణ, రామిరెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ఆశీర్వాదమ్మ, రైతు సంఘం శ్రీనివాసులు, వీరప్ప, నాగేళ్ల బావన్న, సమాజ సంఘం నారాయణస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఓబుళదేవరచెరువు, మే 13(ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఎంపీపీ తుమ్మల పర్వీన్ షామీర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్టు విల్సన్ మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తామని, అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు తప్పకుండా హాజరుకావాలని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

బత్తలపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శివయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బత్తలపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా.. బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

తాడిమర్రి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలో కిశోరి వికాసం - వేసవి శిక్షణ కార్యక్రమాలపై బాలికలకు సీడీపీఓ సరస్వతి మంగళవారం అవగాహన కల్పించారు. తప్పని సరిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పైన అవగాహన కల్పించారు. ఇందులో సూపర్‌వైజర్ లలితమ్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్ కట్టడిపై అవగాహన

నల్లమాడ, మే 13(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ కట్టడి - నివారణపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం వీధి నాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఎలా వస్తుంది.. ఎలా రాదు.. అన్న విషయాలను, సోకుండా ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర, జనజాగృతి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, ఏఓఆర్ డబ్ల్యూ శ్రీవాణి, రమాదేవి, శాంతమ్మ, శిల్ప పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

నంబులపూలకుంట, మే 13(ఆంధ్రజ్యోతి) : మండల ఇన్‌చార్జీ ఎంపీడీ ఆంజనప్ప కదిరికి బదిలీ అయ్యారు. దీంతో ఆయన్ను పంచాయతీ సిబ్బంది, ఎంపీపీ, సచివాలయ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాము, ఎంపీడీఓ పార్థసారధి, ఏపీఓ మంజుల, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'వ్యవసాయ బోరునీటిని తాగకండి'

రొళ్ల, మే 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయబోరులోని నీటిని తాగవద్దని తహసీల్దార్ షెక్షావలి సూచించారు. మండల పరిధిలోని జిజిహట్టి గ్రామంలో వారం రోజుల క్రితం అతిసారతో అమూల్య (10) బాలిక మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది, రెవెన్యూ, మండలపరిషత్ అధికారులు గ్రామాన్ని సందర్శించి విచారించారు. వ్యవసాయబోరుబావి నీటిని తాగుతున్నట్లు గ్రామస్థులు వారికి వెల్లడించారు. దీంతో ఆ నీటిని అధికారులు నాణ్యత పరీక్ష కేంద్రానికి పంపారు. పరీక్షల్లో నీటిలో నాణ్యత లేదని, వ్యవసాయ బోరు నీటిని తాగవద్దని అధికారులు నిర్ధారించారు. దీంతో తహసీల్దార్ బోరుబావి నీటిని ఎవరూ తాగవద్దని సూచించారు.

ముగిసిన యల్లమ్మ ఉత్సవాలు



ఊరేగింపుగా తీసుకొస్తున్న జ్యోతులు, బోనాలు

నంబులపూలకుంట, మే 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న యల్లమ్మ తిరునాళ్ల మంగళవారంతో ముగిశాయి. వివిధ కార్యక్రమాలతో ఈ తిరునాళ్లను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జామున భక్తులు జ్యోతులు, బానాలు అమ్మవారికి సమర్పించారు. జ్యోతులను ఇళ్ల వద్ద నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి.. ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసి, అమ్మవారికి సమర్పించుకున్నారు.



అమ్మవారికి సమర్పిస్తున్న జ్యోతులు

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగేంద్ర (ఫైల్)

బుక్కపట్నం, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెండ్రాయుని పల్లి గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్లంపల్లి గ్రామానికి చెందిన నాగేంద్ర (43) మరణించాడు. నాగేంద్ర, అదే గ్రామానికి చెందిన డ్రైవర్ శ్రీకాంత్ సోమవారం బోలోరా వాహనంలో మామిడి కాయలు తీసుకొని.. ధర్మవరం మార్కెట్‌కు వెళ్లారు. వాటిని అమ్మి .. తిరిగి వస్తుండగా .. ఆ వాహనం అదుపు తప్పి.. బోల్తా పడింది. ఈప్రమాదంలో నాగేంద్ర అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోలీసులు పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా, నాగేంద్రకు భార్య సుగుణమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ శ్రీకాంత్ పుట్టపర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

షెడ్డుకు నిప్పుపెట్టిన దుండగులు

రూ.3 లక్షల మేర ఆస్తినష్టం



దగ్ధమవుతున్న వేరుశనగకాయలు, వ్యవసాయ పరికరాలు

ధర్మవరంరూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్వంపల్లి గ్రామానికి చెందిన హరి పొలంలో ఉన్న షెడ్డుకు గుర్తుతెలియని దుండుగలు మంగళవారం నిప్పుపెట్టారు. దీంతో అందులో ఉన్న డ్రిప్పు పరికరాలు, వేరుశనగ బస్తాలు, స్పింకర్ పైపులు, వ్యవసాయ సామగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు బాధితుడు వాపోయాడు. రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో.. ఆ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అయినా సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

గాండ్లపెంట, మే 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదురుగా రైతు చెన్నారెడ్డి పొలం ఉంది. అందులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి.. అందులోని కాపర్ వైర్‌ను చోరీ చేశారు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన రైతు చెన్నారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాలిక అదృశ్యం



ఉదయ చంద్రిక

పుట్టపర్తిరూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం ప్రశాంతి గ్రామ్ వాసి అరుణ కుమార్తె నసనకోట ఉదయ చంద్రిక (17) కనిపించడం లేదు. ఈ నెల 11 ఇంటి నుంచి వెళ్లిన ఆ బాలికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలు గ్రామాల్లో గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై లింగన్న మంగళవారం తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96839కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కలుషిత నీరు సరఫరా



నల్లచెరువు (కదిరి), మే 13(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండల కేంద్రలోని వీవర్స్ కాలనీలో కొళాయిలో మంగళవారం మురికి, బురద నీరు సరఫరా అయిందని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. ఆ నీరు తాగడానికి పనికి రావడం లేదని, అధికారులు స్పందించాలని కోరారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నరేష్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఓవర్ హెడ్ ట్యాంక్ అపరిశుభ్రంగా ఉండటంతో ఈ సమస్య వచ్చిందని, వెంటనే ఆ ట్యాంక్‌ను మంగళవారం శుభ్రం చేయించామని, తాగు నీరు కలుషితం కాకుండా శావ్వత చర్యలు చేపడతామని అన్నారు.

హంద్రీనీవా కాలువ వెడల్పు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కదిరిఅర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి.. వ్యవసాయ భూములకు నీరు అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సభ్యుడు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ.. హంద్రీనీవా ద్వారా ఉమ్మడి జిల్లాలో మూడున్నర లక్షల ఎకరాలకు నీరు అందించి, ఆయికట్టుగా మారుస్తామని పాలకులు హామీ ఇచ్చారన్నారు. దశాబ్దాలు గడుస్తున్నా... ప్రభుత్వాలు మారుతున్నా... అది అమలు కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల వల్ల భూగర్భజలాలు అడుగట్టిపోతాయన్నారు. కాలువను వెడల్పు చేసి, పిల్ల కాలువలు నిర్మించి వ్యవసాయ భూములకు నీరు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎల్ నరసింహులు, వివి రమణ, శివన్న, సాంబశివ, రామమోహన్, బాబ్‌జాన్, ముస్తాక్ పాల్గొన్నారు.

దశపత్ర కషాయాల తయారీ

తనకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొళ్లపల్లి(కొత్తకురవపల్లి) గ్రామంలో మంగళవారం జనజాగృతి ఆధ్వర్యంలో దశపత్ర కషాయాల తయారీ చేపట్టారు. పంటలకు పురుగుమందులు ఉపయోగించకుండా ప్రకృతి సిద్ధంగా స్థానికంగా లభించే వేప, కానుగ, ఏరివేమ, ఉసిరి, నిమ్మ, సీతాఫలం, ఉలింజ తదితర ఆకులతో దశపత్ర కషాయాన్ని తయారు చేసే కార్యక్రమం చేపట్టారు. కషాయాన్ని ఉపయోగించడం వల్ల కాయతొలిచే పురుగు బారి నుంచి పంటలను కాపాడవచ్చన్నారు. రసాయనిక, క్రిమిసంహారక మందులను తగ్గించి రైతులకు పెట్టుబడులు తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఆర్‌డబ్ల్యూఐ ప్రోగ్రామ్‌లో మండలంలో ఎంపిక చేసిన 19 గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామ కమిటీ ఏర్పాటు



నూతన కమిటీతో మంత్రి సవిత

పెనుకొండ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లిలో మంగళవారం పట్టణంలోని టీడీపీ క్యాంప్ కార్యాలయంలో మంత్రి సవిత ఆధ్వర్యంలో శెట్టిపల్లి గ్రామ కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా దివాకర్‌నాయక్, ఉపాధ్యక్షుడుగా కె. చిరంజీవి, మరో ఎనిమిది మందిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దయ్య, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, మునిమడుగు వెంకటరాముడు, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, పట్టా వెంకటరాముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్‌కు సన్మానం

అమరాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న టెక్నికల్ అసిస్టెంట్ మంజునాథ్‌ను మండల పరిషత్ పరిపాలన అధికారి ఆరాధ్యస్వామి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. అందరి మన్ననలు పొందుతూ అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ జగదీశ్, జూనియర్ ఇంజనీర్ జగదీశ్, టెక్నికల్ అసిస్టెంట్లు హనుమంతరాయప్ప, వసంతలక్ష్మీ, శంకూర్, ఫీల్డ్ అసిస్టెంట్లు రంగారెడ్డి పాల్గొన్నారు.

బ్రోకర్లదే హవా..!

- తహసీల్దార్ కార్యాలయంలో తిష్ట
- కొందరు అధికారులతో కుమ్మక్కు
- పైసలిస్తే ఏపనైనా క్షణాల్లో పూర్తి
- రికార్డుల తారుమారుతో ఇబ్బందులు
- రెగ్యులర్ తహసీల్దార్ లేక అవస్థలు

చిలమత్తూరు అంటే జంకుతున్న రియల్ వ్యాపారులు

చిలమత్తూరు, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం బ్రోకర్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దీంతో పైసలిస్తే తప్ప పనులు జరగడం లేదు. కొందరు అధికారులు కూడా పైసా వసూళ్లే ధ్యేయంగా పని చేస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఇక్కడ రెగ్యులర్ తహసీల్దార్లు ఎక్కువ రోజులు ఉండకపోవడం వల్లే కార్యాలయం భ్రష్టు పట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో 2004 నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడ ఉన్న రియల్ ఎస్టేట్ బూమ్‌ను ఆ సరాగా చేసుకొన్న బ్రోకర్లు కొందరు అధికారులను తమ వలలో వేసుకుని హవాను కొనసాగిస్తున్నారు. ఇక్కడకు వచ్చే ప్రతి అధికారి బలహీనతలను తెలుసుకొని వారి అవసరాలను తీర్చేందుకు బ్రోకర్లు ముందుంటారు. ఆ నేపథ్యంలోనే తమ అవసరాలను వారి ముందు పెట్టి సులభంగా పని కానిచ్చేస్తున్నారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి సంవత్సరాల సమయం పట్టినా, ఈ బ్రోకర్ల పని మాత్రం క్షణాల్లో జరిగిపోతుంటాయి.

రికార్డుల తారుమారులో ప్రధాన పాత్ర

తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల తారుమారు అవుతున్న విషయంలో బ్రోకర్లదే ప్రధాన పాత్రగా కనిపిస్తుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లిటిగేషన్ భూములను చూపిస్తారు. వీరు చూపించే భూములకు సరైన రికార్డులు లేకపోయినా తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న పరిచయాలతో రికార్డులు తారుమారు చేస్తారు. బ్రోకర్లు ఇచ్చే పైసలకు ఆశపడే అధికారులు వారు చెప్పినట్లుగానే నిబంధనలకు విరుద్ధంగా రికార్డులను తారుమారు చేసేస్తారు. వివాదాస్పద భూములను లాగిన్ చేయించడం, అన్ని సక్రమంగా ఉన్న వాటిని డిస్ప్యూట్‌లో పెట్టించడంలో కూడా ఈ బ్రోకర్లదే ప్రధాన పాత్ర.

కిందిస్థాయి సిబ్బంది ఆడింది ఆట పాడింది పాట

రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగులు ఆడింది ఆట పాడింది పాటగా విధులను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వీఆర్వోలు విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. గ్రామ సచివాలయాల్లో ఉండాల్సిన వారు ప్రజలకు అందుబాటులో లేకుండా బయట తిరుగుతున్నట్లు సమాచారం. ఎవరైనా ఎక్కడున్నారని ప్రశ్నిస్తే తాము పనిమీద ఫీల్డ్ లో ఉన్నామంటూ పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారు. ప్రతి పనికి రేటు కడుతున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం వీఆర్వోల చేతుల్లోనే ఉండటంతో వారి 'వ్యాపారం' మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది.



చిలమత్తూరు మండల తహసీల్దార్ కార్యాలయం

జంకుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

ఇటీవల బయటపడిన రెవెన్యూ అక్రమాలతో మండలంలో రియల్ వ్యాపారం కుదేలైంది. భూములకు సంబంధించిన వన్‌బీలను యథేచ్ఛగా మార్చేయడం, వెబ్‌ల్యాండ్‌లో పేర్లు మార్పు చేసి పెట్టడం, వన్-బీలలో విస్తీర్ణం పెంచి చూపించడం వంటివి బయటపడటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు బాగా నష్టపోయారు. స్థానికంగా ఉన్న కొందరు బ్రోకర్లు ఇలాంటి అక్రమాలను అధికారులతో అతి సులభంగా చేయిస్తున్నారన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. భూముల విలువ కోట్లలో పలుకుతుండటంతో అంత పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన భూములకు సరైన రికార్డులు లేకుండా పోతున్నాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొన్న భూములకు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీంతో లిటిగేషన్ భూములు, తారుమారైన రెవెన్యూ రికార్డుల భూములను కొనలేక కొంత కాలంగా చిలమత్తూరు వదిలి ఇతర చోట్లకు వ్యాపారులు తరలిపోతున్నట్లు స్పష్టంగా కనపడతోంది. చిలమత్తూరు మండలంలో భూమి కొనుగోలు చేయాలంటేనే వ్యాపారులు జంకే పరిస్థితి వచ్చింది.

వీఆర్వోల స్థాయి నుంచి ఇదేతంతు

వీఆర్వోల స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు బ్రోకర్ల చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయారు. కొందరు వీఆర్వోలు ఏకంగా బ్రోకర్లతో చేతులు కలిపి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దిగారు. మరికొందరైతే వారి బంధువులనే బ్రోకర్లుగా ఏర్పాటు చేసుకొని కార్యకలాపాలు నడుపుతు న్నారు. రికార్డులు వారి చేతుల్లోనే ఉండటంతో ఏ పనైనా అవలీలంగా చేసి బ్రోకర్లకు అందిస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కంటే బ్రోకర్ల పనులు చేయడంపైనే ఎక్కువగా శ్రద్ధ చూపిస్తున్నారు.

రెండు నెలలుగా కానరాని తహసీల్దార్

నిబంధనలకు విరుదధంగా మ్యుటేషన్లు చేసిన ఇన్‌చార్జ్ తహసీల్దార్ యునస్ బాబు సస్పెన్షన్‌కి గురయ్యారు. దీంతో హిందూపురం తహసీల్దార్ వెంకటేశులుకు చిలమత్తూరు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన మండలానికి ఎక్కువ సమయం కేటాయించకపోవడంతో ప్రజా సమస్యలు ఏమాత్రం పరిష్కారం కావడం లేదు. రెండు నెలలుగా తహసీల్దార్ కనపడటం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ని నియమించి బ్రోకర్ల రాజ్యాన్ని అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తప్పవు



ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు. చిలమత్తూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో రెగ్యులర్ తహసీల్దార్ లేరు. కొరత కారణంగా రెగ్యులర్ తహసీల్దార్ నియామకంలో ఆలస్యం జరుగుతోంది. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో తహసీల్దార్ల నియామకం జరిగేలా చర్యలు తీసుకుంటాం. వీఆర్వోలు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పక ఉంటాయి.

- ఆనంద్‌కుమార్, ఆర్డీఓ, పెనుకొండ

జగన్ పర్యటన దృశ్యాలు



మురళీనాయక్ తల్లిదండ్రులను ఓదారుస్తున్న జగన్





జగన్ రాక సందర్భంగా పోలీసు బందోబస్తు

మరమ్మతులకు నోచుకోని చెక్‌డ్యాంలు

వృథా అవుతున్న వర్షపునీరు

అడుగంటుతున్న బోర్లు... ఆందోళనలో రైతులు

మడకశిర, మే 13(ఆంధ్రజ్యోతి): వృథాగా పోతున్న నీటిని అరికట్టి భూగర్భజలాలను పెంపొందించేందుకు లక్షలాది రూపాయలు వ్యయం చేసి నిర్మించిన చెక్‌డ్యాంలు వర్షాలకు తెగి పోయి సంవత్సరాలు గడుస్తున్న నేటికీ మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో వర్షాలు పడ్డప్పుడు నీటిని వృథా అవుతోంది. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయి తాగు, సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడం, ఎటువంటి సాగు నీటివనరులు లేకపోవడంతో ఈ ప్రాంతం రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ పంటసాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వర్షాలు కురవక పోవడం పంటలు దెబ్బతినడంతో కొంత మంది రైతులు అప్పులు చేసి బోర్లు తవ్వించుకుని వాటి కింద పంటలు సాగు చేసి జీవనం సాగిస్తున్నారు. కురిసిన వర్షపు నీరు కాలువల ద్వారా వృథాగా పోతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీటమట్టం తగ్గడంతో పంటలు సాగు చేసేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అప్పట్లో ప్రభుత్వం భూగర్భ జలాలు పెంపొందించేందుకు వాటర్‌షెడ్ల పథకం, ఇరిగేషన్ పరిధిలో వృథాగా వెళ్లేనీటిని అరికట్టేందుకు చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టారు. వర్షాలు పడినప్పుడు నీరు అందులో నిల్వ ఉంటూ భూగర్భజలాల మట్ట పెరిగి ఆ పరిసర ప్రాంతాలోని బోర్ల నీటి మట్టం కూడా పెరిగేది. దీంతో వాటి కింద రైతులు పంటలు సాగుచేసే వారు నీటి సమస్య ఉత్పన్నం అయ్యేది కాదు. గత దశాబ్దకాలంగా కురిసిన వర్షాలకు చెక్‌డ్యాంలు తెగి పోవడం, అందులో పూడిక పెరిగిపోవడంతో వర్షాలు కురిసిన అందులో నీరు నిలబడకుండా వృథాగా పోతున్నాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోయి నీటి సమస్య తలెత్తుతోంది. నియోజకవర్గంలో నిర్మించిన చెక్‌డ్యాంలో ఎక్కువభాగం పూడిక పేరుకుని పోవడం, వర్షాలకు పలు చోట్ల చెక్‌డ్యాంలు తెగిపోయాయి. తెగిన చెక్‌డ్యాం లను మర్మతులు చేపట్టి అందులో పూడిక తొలగిస్తే వర్షాలు కురిసినప్పుడు అందులో నీరు నిల్వ ఉంటూ ఆ పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాల మట్టం పెరిగి తాగు, సాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని రైతులు అంటున్నారు. పది సంవత్సరాల క్రితం తెగిన చెక్‌డ్యాంలకు సంబంధించి మరమ్మతులు చేయించేందుకు సంబంధిత శాఖ అధికారులు సర్వే చేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపడం జరిగింది. గత ఐదు సంవత్సరాలుగా నిధులు మంజూరు కాకపోవడంతో వాటి మరమ్మతు పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తెగిన చెక్‌డ్యాంలకు మరమ్మతు చేయించి నీరు నిల్వ ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



గంగులవాయి పాళ్యం వద్ద చెక్‌డ్యాంలో పేరుకుపోయిన పూడిక



హెచ్ఆర్ పాళ్యం వద్ద తెగిన చెక్‌డ్యాం (ఫైల్)

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పరిగి, మే 13(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలంలోని మణేసముద్రం గ్రామానికి చెందిన నరసింహులు స్కూటీలో మంగళవారం కర్ణాటక నుంచి అక్రమ మద్యం తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 480 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఈఎస్‌టీఎఫ్ సీఐ హరిక్రిష్ణ తెలిపారు. వచ్చిన సమాచారం మేరకు మండలంలోని వన్నంపల్లిక్రాస్‌వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ సింహా, సిబ్బంది క్రిష్ణ, మల్లికార్జున, లక్ష్మీనారాయణ, భరత్ పాల్గొన్నారు.

'దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి'



కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న కార్మికులు

పెనుకొండ, మే 13(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయుసీ నాయకులు రమేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఏఐటీయుసీ నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో కార్మికులు కమిషనర్ సతీష్‌కుమార్‌కు సమ్మె నోటీసును అందించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కరుల్, మణి, గజేంద్ర, మహేష్, బావక్క, నరసమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పార్వేట ఉత్సవం



మడకశిర టౌన్, మే13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు ఉత్సవంలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డులోగల రేణుక యల్లమ్మదేవి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుక మంగళవారం వైభవంగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ రమేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నాయకులు పరశురాం, నవీన్, రాఘవేంద్ర, హరీష్ చైర్మన్ వెంట ఉన్నారు.

మూలనపడ్డ పంచాయతీ ట్రాక్టర్



నిరుపయోగంగా ఉన్న పంచాయతీ ట్రాక్టర్ ఇదే

హిందూపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోనే కిరికెర పంచాయతీ పెద్దది. గత తెలుగుదేశం హయాంలో ప్రత్యేక చొరవ తీసుకుని పంచాయతీకి రెండు ట్రాక్టర్లు మంజూరుచేయించారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి చెందినవారు సర్పంచులయ్యారు. రెండు ట్రాక్టర్లలో ఒకటి మాత్రమే ఉపయోగిస్తూ మరో ట్రాక్టర్‌ను నిరుపయోగంగా వదిలేశారు. అది ఎండకు ఎండి వానకు తడుస్తోంది. అంతేకాక వాటి టైర్లు కూడా ఎవరో ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనిని ఉపయోగంలోకి తీసుకురావాలని పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోలేదు. సర్పంచ్ కూడా దీనిపై స్పందించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి సవిత

పెనుకొండ, మే 13(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. మంగళవారం స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఐటీఐ, ఎంబీఏ, చదివిన నిరుద్యోగ యువత దాదాపు లక్షల మంది ఉన్నారన్నారు. ప్రైవేట్ రంగాల్లోనూ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఈ జాబ్‌మేళ యువతకు ఎంతో దోహదపడుతుందన్నారు. దాదాపు 50కిపైగా వివిధ కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొని నైపుణ్యాన్నిబట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు.

ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన మంత్రి

మెగా జాబ్‌మేళాకు 1023మంది నిరుద్యోగులు హాజరుకాగా అందులో 425మంది ఎంపికయ్యారు. వారికి మంత్రి నియామక పత్రాలను అందజేసి అభినందించారు.

యూత్ ఐకాన్‌కు ఎంపికైన విద్యార్థిని అభినందించిన మంత్రి

పెనుకొండ, మే 13(ఆంధ్రజ్యోతి): యూత్ ఐకాన్‌కు స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 విద్యార్థిని వర్షిణి ఎంపికైంది. ఈనెల 15, 16న కర్ణాటక రాష్ట్రం మంగళూరులోని వీనపయ్య డ్రీం యూనివర్సిటీలో జరిగే కార్యక్రమానికి ఆంధ్ర నుంచి వర్షిణి ఎంపికైందని ఎన్ఎస్ఎస్ పీఓ ప్రతాప్ తెలిపారు. మంగళవారం వర్షిణిని బీసీ జౌళిశాఖ మంత్రి సవిత, ప్రిన్సిపాల్ కేశవరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ప్రతాప్, వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, టీడీపీ నాయకులు బొక్సంపల్లి రామక్రిష్ణ తదితరులు అభినందించారు.



ఎంపికైన అభ్యర్థులతో మంత్రి సవిత, ప్రిన్సిపాల్ కేశవరావు



విద్యార్థినిని అభినందిస్తున్న మంత్రి సవిత

వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెనుకొండ, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక అల్విన్ కాలనీలోని సత్యసాయి భజన మందిరంలో మంగళవారం నిర్వహించిన ఫోబియో వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో పుట్టపర్తికి చెందిన వైద్యులు గిరీష్, పద్మావతమ్మ మోకాళ్లనొప్పులు, వెన్నెముక, శ్వాసకోస్త, థైరాయిడ్, మానసిక సమస్యతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పుట్టపర్తి నుంచి వచ్చిన పాలిటెన్సి వైద్య బృందం కిడ్నీ, క్యాన్సర్, పెరాలసిస్ మొదలగు రోగులను పరిశీలించి వైద్యం అందించారు. శిబిరాన్ని ప్రతి నెలా రెండో మంగళవారం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

'వ్యవసాయ బోరునీటిని తాగకండి'

రొళ్ల, మే 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయబోరులోని నీటిని తాగవద్దని తహసీల్దార్ షెక్షావలి సూచించారు. మండల పరిధిలోని జిజిహట్టి గ్రామంలో వారం రోజుల క్రితం అతిసారతో అమూల్య (10) బాలిక మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది, రెవెన్యూ, మండలపరిషత్ అధికారులు గ్రామాన్ని సందర్శించి విచారించారు. వ్యవసాయబోరు బావి నీటిని తాగుతున్నట్లు గ్రామస్థులు వారికి వెల్లడించారు. దీంతో ఆ నీటిని అధికారులు నాణ్యత పరీక్ష కేంద్రానికి పంపారు. పరీక్షల్లో నీటిలో నాణ్యత లేదని, వ్యవసాయబోరు నీటిని తాగవద్దని అధికారులు నిర్ధారించారు. దీంతో తహసీల్దార్ బోరుబావి నీటిని ఎవరూ తాగవద్దని సూచించారు.

జనావాసాల్లోకి వన్యప్రాణులు

సోమందేపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): ఎండవేడిమికి తట్టుకోలేక వన్యప్రాణులు జనవాసాల్లోకి వస్తున్నాయి. సోమందేపల్లి సమీపంలో ఉన్న గంగాదేవి వంక వద్ద మంగళవారం జింకల గుంపు వీధులను దాటుకుని హంద్రీనీవా కాలువ వైపు వెళ్లడం కనిపించింది. అడవి ప్రాంతంలో ఉన్న గుంతలు ఎండిపోవడంతో నీటికోసం వన్యప్రాణులు అలమటిస్తున్నాయి. ఎండ వేడిమిని తట్టుకోలేక అటవీప్రాంతం వదిలి జనావాసాలవైపు పడుతున్నాయి. గొల్లపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వ తగ్గిపోవడంతో మడకశిర బ్రాంచ్ కెనాల్‌ద్వారా హిందూపురానికి వెళ్లే నీటికాలువ ఎండిపోయింది. వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయల నిధులు కేటాయించింది. అటవీప్రాంతంలో అక్కడక్కడ నీటి తొట్లెలు ఏర్పాటుచేస్తే వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకునే అవకాశం ఉంది. అటవీశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం వన్యప్రాణుల పాలిట శాపంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎఫ్ఆర్‌ఓను వివరణ కోరగా వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉందని, వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకునేందుకు వచ్చివెళుతున్నాయని, వాటికి వచ్చిన ప్రమాదమేమీ లేదన్నారు.

చిలమత్తూరు, (ఆంధ్రజ్యోతి): దప్పిక తీర్చుకోవడానికి వన్యప్రాణులు పడరాని పాట్లు పడుతున్నాయి. నీటి జాడ కనిపడితే చాలు అక్కడికి పరుగులు పెడుతున్నాయి. బీడు భూముల్లో ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. వేసవికాలం కావడంతో వాటికి గుక్కెడు నీళ్ల దొరకడం కష్టంగా మారింది. ఎండలు అధికంగా ఉండటంతోపాటు తాగడానికి చుక్కనీరు లభించని కారణంగా అవి దిక్కులు చూస్తున్నాయి. దాహంతో సతమతమవుతున్నాయి. వన్యప్రాణుల దాహార్తి తీర్చడం కోసం అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొడికొండ చెక్‌పోస్టు వద్ద నీటి కోసం పొలాల వద్ద జింకల గుంపు

యంత్రాలతో పనులు

ఇబ్బందుల్లో ఉపాధి కూలీలు

పావగడ, మే 13(ఆంధ్రజ్యోతి): కూలీలకు పనులు కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఉపాధి హామీ పథకానికి కొందరు తూట్లు పొడుస్తున్నారు. యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. దీంతో ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జేసీబీలతో పనులను చేయిస్తూ తమకుఉపాధి లేకుండా చేస్తున్నారని కోటిగుడ్డం గ్రామానికి చెందిన కూలీలు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు పూడికతీత, పొలాలకు కట్టువేయడం తదితర పనులను యంత్రాలతో చేయిస్తున్నారన్నారు. కొందరు పెత్తందార్లు యంత్రాలతో పనులు పూర్తిచేసి బిల్లుల మంజూరు కోసం మాత్రమే ఒకరోజు కూలీలను ఉపయోగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈఓ జానకిరాంను వివరణ కోరగా కొద్దిరోజుల్లో తాను రిటైర్ట్ అవుతున్నానని, తనను ఏమీఅడగవద్దని తెలిపారు.

ముగిసిన యల్లమ్మ ఉత్సవాలు

నంబులపూలకుంట, మే 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న యల్లమ్మ తిరునాళ్ల మంగళవారంతో ముగిశాయి. వివిధ కార్యక్రమాలతో ఈ తిరునాళ్లను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జామున భక్తులు జ్యోతులు, బోనాలు అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేకాలంకరణతో జ్యోతులను ఇళ్ల వద్ద నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి.. ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి సమర్పించుకున్నారు.



అమ్మవారికి జ్యోతులు సమర్పిస్తున్న భక్తులు